AKSHITHA TV
ప్రతిక్షణం... ప్రజాపక్షం

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
15 15th Anniversary 15








epaper.aakshitha.com
akshithanews akshithatelugudaily

సంపుటి : 15 సంచిక : 13 | శుక్రవారం 11, అక్టోబర్ 2024 | చీఫ్ ఎడిటర్ : యం.దాస్ | నల్లగొండ | హైదరాబాద్ | ఖమ్మం | వరంగల్ | మహబూబ్‌నగర్ | అమరావతి | పేజీలు : 8 , + ట్యాబ్ 8 వెల : రూ.5.00




## ఆదాయ మార్గాలపై
# దృష్టి పెట్టాలి

**మంత్రులతో సమీక్షలో సీఎం సూచన**

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

ఆదాయ సమీకరణపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇవాళ తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆదాయ సమీకరణాలకు ఉన్న అవకాశాలను సీఎం ఆరా తీశారు. కేసీఆర్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు మోపిందని, అప్పటి అప్పులకు వడ్డీలుకట్టేందుకే రాష్ట్ర ఖజానాలో మెజార్టీ వాటా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఆదాయ మార్గాలు తగ్గుతుంటే అప్పుల భారం పెరుగుతుంటడంతో ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఈ సమీక్షలో సీఎం చర్చించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలకు ఎక్కడా ఆర్థిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల విషయంలో సీఎం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

## అశ్రునయనాల మధ్య
# రతన్ టాటా అంత్యక్రియలు

- మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహణ
- అమిత్ షా, సిఎం షిండే, పారిశ్రామిక దిగ్గజాల నివాళి

2





## రేవంత్ పాలనలో
# రైతులకు నిద్ర లేదు

- ఇచ్చిన హామీల కోసం రోడ్డెక్కుతున్నారు
- మాజీ మంత్రి కేటీఆర్

2



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు.

## రతన్ టాటా మరణంపై
# రేవంత్ దిగ్భ్రాంతి

- వ్యాపార రంగంలో విలువలకు పట్టం కట్టారని నివాళి



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

ప్రముఖ పారిశ్రామిక వేత్త, మానవతావాది రతన్ టాటా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటు అని అన్నారు. రతన్ టాటా వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి కొనియాడారు. పద్మవిభూషణ్ సహా అనేక గౌరవ పురస్కారాలు అందుకున్న రతన్ టాటా ఇక మన మధ్య లేకపోవడం బాధకరమని అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందించారని గుర్తుచేశారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా రతన్ టాటా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు రేవంత్. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.

# గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

**అప్పడే సిఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ**

2

మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు.



# నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

మంత్రి కొండా సురేఖపై భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. భారాస నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. ఇటీవల కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీరంగంలోని పలువురిని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖపై ఇప్పటికే ప్రముఖ సినీనటుడు నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఇదిలావుంటే నాగార్జున పిటిషన్ ఆధారంగా మంత్రి కొండా సురేఖకు నాంపల్లికోర్టు నోటీసులు జారీ చేసింది.

# తెలుగు రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా విడుదల

**ఎపికి రూ. 7,211 కోట్లు,**
**తెలంగాణకు రూ. 3,745 కోట్లు**

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :**

కేంద్ర పనుల్లో రాష్ట్రాలకు చెల్లించాల్సిన వాటాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు కలిపి దాదాపు రూ.11 వేల కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ. 7,211 కోట్లు, తెలంగాణకు రూ. 3,745 కోట్లు విడుదలయ్యాయి. అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.1,78,173 కోట్లు రిలీజ్ చేశారు. అక్టోబరు, 2024లో చెల్లించాల్సిన సాధారణ వాయిదాకు అదనంగా ఒక ముందస్తు వాయిదా వేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ముందస్తు వాటాగా రూ. 89,086.50 కోట్లతో కలిపి మొత్తం రూ. 1,78,173 కోట్లు రిలీజ్ చేసింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్రం తెలిపింది. రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమ వ్యయాలకు ఆర్థిక సాయం అందించడానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపింది.

# ఊరూవాడా సద్దుల బతుకమ్మ సంబరాలు

- ట్యాంక్‌బండ్‌పై వైభవంగా బతుకమ్మ సంబరం
- పలు జిల్లాల్లో వేడుకగా సాగిన ఉత్సవాలు

వార్త 2లో





# రేవంత్ పాలనలో రైతులకు నిద్ర లేదు

## ఇచ్చిన హామీల కోసం రోడ్డెక్కుతున్నారు

## మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్ అక్షిత ప్రతినిధి :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లూ ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి..! రుణమాఫీలో దగా జరిగింది.. రైతు భరోసా జాడా పత్తా లేదు.. వరదలు ముంచెత్తి నష్టాల్లో.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష..? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

## అప్పుడే సిఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

# ముగిసిన బతుకమ్మ వేడుకలు

## ఊరూవాడ సంబరాలతో వీడ్కోలు

## హైదరాబాద్ సహా పట్టణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగ తుది అంకానికి చేరింది. గురువారం సద్దుల బతుకమ్మతో పండగ ముగిసింది. ఊరూవాడా తొమ్మిది రోజులుగా బతుకమ్మ పండగ జోరుగా సాగుతోంది. ఆడపడుచుల రాకతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. సద్దుల బతుకమ్మ వేడుకలుకు పల్లెలు మొదలు పట్టణాల వరకు ముస్తాబయ్యాయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా బతుకమ్మను నిర్వహించారు. సిద్దిపేట, వరగంల్ తదితర పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రకృతి రమణీ యకతకు బతుకమ్మ నిదర్శనం. ఆశ్వయుజ మాసం శుద్ధ పాఢ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను వేడుకగా జరుపుకున్నారు. రంగురంగుల పూలను త్రికోణాకృతిలో పేర్చి, అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ..ఆడి, పాడతారు. అప్పుడు మహిళలు పాడే పాటలు మనసుకు హత్తుకుంటాయి. ఏరోజు ప్రత్యేకత ఆ రోజుదే. ఇలా తొమ్మిది రోజులు ఆడిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి, నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని ఆడపడుచులంతా పంచుకున్నారు. తొమ్మిదో రోజు వేడుకగా సద్దుల బతుకమ్మను నిర్వహించి గౌరీదేవిని సాగనంపారు. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి దసరా ముందు శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరుపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించుకొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి- అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది.అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగిస్తారు. సకల ప్రాణులకూ జీవశక్తిని అందజేసే ప్రకృతి, ఆకృతి- బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సందడి విలసిల్లుతుంది. పూర్ణత్వానికి సంకేతం- తొమ్మిది. నవ విధ భక్తి మార్గాలకు, నవ నిధులకు ప్రతిబింబంగా బతుకమ్మను తొమ్మిది రకాల పుష్పాలతో తొమ్మిది వరసల్లో అమరుస్తారు. తొమ్మిది రోజులూ గౌరీదేవి 'పూలమ్మ'గా పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహిస్తారు. గౌరమ్మను అత్తవారింటికి- అంటే, శివుడి వద్దకు పంపుతూ, సకల సౌభాగ్యాలూ అనుగ్రహించడానికి మళ్లీ తరలిరమ్మని వేడుకుంటారు. చివరికి ఆ ప్రకృతిలోనే మమేకమవుతుంది. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి- జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి.

# అశ్రునయనాల మధ్య రతన్ టాటా అంత్యక్రియలు



## మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహణ

## అమిత్ షా, సిఎం షిండే, పారిశ్రామిక దిగ్గజాల నివాళి







**ముంబై,**

పారిశ్రామిక దిగ్గజం,టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కేంద్రహోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, సిఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటి సిఎం ఫడ్నవీస్, శక్తికాంద్ దాస్, అంబానీ దంపతులు, ఇతర ప్రముఖులు నివాళి అర్పించారు. హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు. అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం నిర్దేశిరచిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీనిగా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చింది అలాగే తిరిగి ఐక్యమవ్వాలని వీరి ఆశయం. పార్సీల సంప్రదాయం ఇలా ఉన్నప్పటికీ..మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారింది. దీంతో సోలార్ లేదా విద్యుత్ విధానంలో దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీరు, అగ్ని, నేల కాలుష్యం కాకుండా జొరాస్ట్రియన్ నియమాలకు అనుగుణంగానే అంతిమ సంస్కారాలు కొనసాగిస్తున్నారు.రతన్ టాటా మరణించిన తర్వాత ఆయన అంత్యక్రియలు ఏ పద్ధతిలో జరుపుతారన్న దానిపై విస్తృత చర్చ జరిగింది. ఆయన పార్దీవ దేహం వద్ద పార్శీ, మస్లిం, క్రిస్టియన్ , సిఖ్ అలాగే హిందూ మతాలకు చెందిన వారు ప్రార్థనలు చేస్తూ కనిపించారు. రతన్ టాటాకు నివాళులు అర్పించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, వీఐపీలు ముంబైకి తరలి వచ్చారు రతన్ టాటా ఒక్క వ్యాపారవేత్తంగానే కాకుండా సేవతత్పరతో చాలా దేశ ప్రజల మన్ననలు పొందారు. అందుకే ఆయన లేరనే వార్త తెలిసిన తర్వాత అందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ఊరూవాడా సద్దులబతుకమ్మ సంబరాలు





## ట్యాంక్‌బండ్‌పై వైభవంగా బతుకమ్మ సంబరం

## పలు జిల్లాల్లో వేడుకగా సాగిన ఉత్సవాలు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**







తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి. వేలాదిమందితో బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. అలాగే ట్యాంక్ బండ్ పరిసరాలు మహిళల సందడితో కళకళ లాడింది. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూడి సిఎం మల్లు భట్టి విక్రమార్కలు సంబురాలకు హాజరయ్యారు. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. వేలాది మంది మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిసాయి. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్ని అంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు. గవర్నర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి సంబురాలు జరుపుకుంటుండడంతో పూల పండుగ విశిష్టతను అధికారులు గవర్నర్ దంపతులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనకు పూర్వీకులు ఇచ్చిన గొప్ప ఆచారం, సంస్కృతీ బతుకమ్మ అన్నారు. భవిష్యత్ తరాలకు ఈ పండుగను అందించడమే మన బాధ్యత అని, చెరువులను కబ్జాలు కాకుండా కాపాడుకుందామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ రోజు చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ అంటేనే చెరువులు అని, బతుకమ్మ చెరువుల్లో నీరు తాగేదని, పొలాలకు నీరు అందించేదని ఆమె తెలిపారు. మన జీవన శైలి చెరువులపై ఆధారపడి ఉందని, హైదరాబాద్‌కు లేక్ సిటీ అని పేరు ఉండేదని, కానీ, ఈ రోజు అవి కనుమరుగు అయిపోయాయని ఆమె తెలిపారు. ఆటలు, పాటలు, బతుకమ్మకు పూజలు ఇది తరతరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# ధరణి పాత యాప్‌ను పునరుద్ధరించాలి

## హైడ్రాతో రియల్ ఎస్టేట్ రంగం కుందేలు అయ్యింది,

## సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్.




**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :**

తెలంగాణ ప్రభుత్వం ధరణి పాత యాప్ ను పునరుద్దించాలని జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సామాజిక ఉద్యమకారులు, సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వ ని కోరారు.గురువారంసూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగినవిలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆన్లైన్లో ధరణి పాత యాప్ తీసివేయడం వల్ల పాత మోటేషన్ ప్రొసీడింగ్స్ ఆన్లైన్లో రావడం లేదన్నారు. ధరణి పాత డిజిటల్ యాప్ ను ప్రభుత్వంపునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎల్ ఆర్ ఎస్ కోసం తెలంగాణ ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు పదివేల చొప్పున చెల్లించారని గుర్తు చేశారు. ఎల్ఆర్ఎస్ స్ కు సంబంధించిన ఆ యాప్ ను ప్రభుత్వం ఆన్లైన్ నుండి తీసివేయడంతో ప్రజలు వ్యాపారస్తులుతీవ్రఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో అధికారులు ఎల్ఆర్ఎస్ లో సర్వే నెంబర్లు, విలేజ్ పేర్లు తప్పుగా నమోదు చేశారని వాటిని కూడా ఎల్ఆర్ఎస్ ద్వారా ఆన్లైన్ అప్లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు .రాష్ట్రంలో హైడ్రా మూలంగా రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైందని అన్నారు .రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడి జీవనం కొనసాగించే ఎంతోమంది రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు .ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం హైడ్రాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని వాపోయారు. స్వయంగా అధికారులే రాష్ట్రంలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కు సెప్టెంబర్ నెలలో ఆదాయం తగ్గిందని పేర్కొన్నారు. హైడ్రాతో రిజిస్ట్రేషన్లు శాతం తగ్గిపోయి స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ జిల్లా గౌరవ సలహాదారుడు దేవత కిషన్ నాయక్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి జిల్లా కోశాధికారి పాల సైదులు పట్టణ కార్యదర్శి అయితే గాని మల్లయ్య గౌడ్ ఆకుల మారయ్య గౌడ్ పట్టణ ఉపాధ్యక్షుడు ఖమ్మంపాటి అంజయ్య గౌడ్ గిరీశం పట్టేటీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సి సి మరియు ఆర్చి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి






**ఎల్బీనగర్, అక్షిత ప్రతినిధి**

గురువారం ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినపురం డివిజన్ పరిధిలోని సాయి ప్రకాష్ నగర్ కాలనీ యొక్క నూతన ఆర్చి మరియు సీ.సీ.రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఇట్టి కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సత్యంచారి, నాయకులు రవిముదిరాజ్ ,చీర శ్రీనివాస్ ,సదానంద్ రెడ్డి మరియు కాలనీవాసులు రాఘవేంద్ర, రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ రావు, నరోత్తంగుప్తా మరియు పలువురు నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజలంతా సంతోషంగా ఉండేలా చూడు తల్లి- క్యామ మల్లేష్



**యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి**

రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రి వేడుకల్లో అమ్మవారు సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. ఈ నవరాత్రి వేడుకలకు ముఖ్య అతిథిగా బి ఆర్ ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 15 వేల రూపాయలు కమిటీకి సమర్పించారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో భాగంగా అమ్మవారు సరస్వతి అవతారంలో ఉంటూ విద్యాబుద్ధులు ప్రసాదించే తల్లిగా పూజలందు కుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కొడారి వెంకటేష్, మేకల నరేష్, బోనగిరి రజిని కాంత్, జంగయ్య, గణేష్, సత్యనారాయణ దశరథ, మహేష్, యాదవ సంఘ%శీ% పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి





## ఆయుధ పూజ, వాహన పూజలు

## జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి అక్టోబర్ 10 అక్షిత బ్యూరో:**

సాయుధ పోలీస్ కార్యాలయములో ఆయుధ పూజ, వాహన పూజలను నిర్వహించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలను నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ సఫలీకృతం అవ్వాలని, దుర్గా మాత కరుణా కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించడం జరిగిందన్నారు.ఈ



కార్యక్రమములో ఎ.ఆర్.డియస్పి నరేందర్, ఆర్.ఐలు రామరావ్, రాజశేఖర్ రెడ్డి, మరియు ఎ.ఆర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఝాన్సీ రెడ్డిని పరామర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి అక్షిత ప్రతినిధి**

షాపింగ్ కాంప్లెక్స్ ఓపెనింగ్ కార్యక్రమంలో కొద్ది రోజుల క్రితం గాయపడి చికిత్స పూర్తి చేసుకుని హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లోగల తన నివాసంలో వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిని శుక్రవారం నాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని గూర్చి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారికి ఝాన్సీ రెడ్డి ఆరోగ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రేడ్డి మండల పార్టీ ఉపాధ్యక్షులు భూక్యా సమ్మయ్య నాయక్ మండల ముఖ్య నాయకులు ఏసి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కూందురు విక్రమ్ రెడ్డి రెంటాల గోవర్ధన్ రెడ్డి ఉళ్లే%శీ%గుల నర్సయ్య గూగులోతు శ్రీనివాస్ మచ్చ రమేష్ కుంట రాజు భాస్కర్ కిషన్ నాయక్ పీరాని ప్రవీణ్ చెగో%శీ%డా సాయికుమార్ పాల్గొన్నారు.

# రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు.

## మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్..

**వరంగల్ , అక్షిత బ్యూరో :**

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. రతన్ టాటా మృతితో దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందన్నారు. దేశం గర్వించే వ్యాపార శిఖరం,గొప్ప మేధావిగా ఎన్నోకొత్తఆవిష్కరణలకు సృష్టికర్తగా, కోట్లాది మంది యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా వారి సృజనాత్మకతను వెలికి తీసిన గొప్ప పారిశ్రామిక వేత్త అని పేర్కొన్నారు.వారు సంపాదించిన డబ్బులో సమాజ సేవకు అధికంగా వినియోగిస్తూ, దాన ధర్మాలుచేయడంలో అపరదాన కర్ణుడిగాపేరొందా రన్నారు. ఎంత ఎదిగినా నిరాడం బరంగా సాగిన వారి జీవనం ఎందరికో ఆదర్శనీయ మన్నారు.



# జిల్లా కోర్టు ప్రాంగణంలో మెంటల్ హెల్త్ డే

**వరంగల్, అక్షిత బ్యూరో:**

వరంగల్ కోర్ట్ మీటింగ్ హాల్లో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ హన్మకొండ డిస్టిక్ జడ్జ్ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ డే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా జిల్లా ప్రిన్సిపల్ జడ్జిలు వరంగల్ హనుమకొండ మాట్లాడుతూ మానసిక సమస్యలు వృత్తి ధర్మంలో అధిగమించడానికి కావలసిన సలహాలు సూచనలపై మాట్లాడి వాటి నివారణ ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపాలని కోరినారు ఈ అవగాహన సదస్సులో వరంగల్ హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొనడం జరిగినది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే వెంకటరమణ మాట్లాడుతూ మానసిక రోగము మనిషి తను ఏర్పరచుకున్నదే కానీ దానివలన మనిషి శారీరకంగా మానసికంగా ఆర్థికంగా సామాజికంగా కుటుంబ పరంగా బంధుమిత్రుల సంబంధాలతోటి సాధారణంగా ఉండలేకపోవుచున్నాడు కాబట్టి శారీరక శ్రమ మానసిక ప్రశాంతత ఆహార నియమాలు పాటిస్తూ కుటుంబ వృత్తి సామాజిక పరమైన సమస్యలపై అవగాహన చేసుకుని పరిష్కార మార్గంలో పయనించినప్పుడే మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండి ప్రకాశవంతమైన జీవితాన్ని గడపవచ్చునని తెలిపినారు




భారతదేశంలో అన్ని రోగాలలో 15% మానసిక వ్యాధిగ్రస్తులే ఉన్నారని తెలిపినారు ఎవరైనా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లయితే 144 16 ఫ్రీ డైల్ నెంబర్ కు ఫోన్ చేసి సైక్రియాటిస్ట్ ద్వారా తాగిన సలహాలు చికిత్సలు తీసుకోవాలని తెలిపినారు ఈ కార్యక్రమములో సైకియాట్రిస్టులు పి పి టి ప్రెజెంటేషన్ చేయడం జరిగినది అనంతరము జిల్లా న్యాయధికారిచే డాక్టర్ వెంకటరమణ ని సైకియాట్రిషన్ సన్మానించడం జరిగినది ఈ కార్యక్రమములో జిల్లా వరంగల్ హనుమకొండ జడ్జీలు వారి సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వరంగల్ హనుమకొండ సిబ్బంది పాల్గొన్నారు.

# ముస్తాబైన బతుకమ్మ తో జగదీష్ రెడ్డి దంపతులు..

## పేట క్యాంపు కార్యాలయంలో సద్దుల బతుకమ్మ సందడి..



**సూర్యాపేట,అక్షిత ప్రతినిధి :**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రారంభమైన సద్దుల బతుకమ్మ సంబరాలు సందడిగాకోనసాగుతున్నాయి.



మహిళ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యురాళ్లు, పెద్ద ఎత్తున మహిళతో కలిసి జగదీష్ రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీతాజగదీష్ రెడ్డి, సోదరిమణి కట్ట రేణుకశేఖర్ రెడ్డి లు పేర్చిన బతుకమ్మ తో మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఫోటోలు దిగి సందడి చేశారు.

# ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇవ్వాలి

## ఐద్వా తిప్పర్తి మండల మహాసభ తీర్మానం

## ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్

**తిప్పర్తి, అక్షిత న్యూస్ :**

కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్ ఎన్నికల సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు 2500 రూపాయలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు.గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో నర రాఘవరెడ్డి భవన్ లో ఐద్వా నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం మండల మహాసభలు నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసి ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీని అమలు చేయడాన్ని స్వాగతిస్తూనే ఆ పథకంలో భాగమైన ప్రతి మహిళకు 2500 రూపాయల నగదును అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా నేటికీ అమలు చేయలేదు. వేగవంతంగా ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల విష జ్వరాలు వేగవంతంగా విస్తరిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి చికెన్ గునియా, డెంగ్యూ లాంటి వ్యాధులకు అన్ని ప్రైవేటు దావకానాల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేటు దావకానాలు దోపిడీ విష జ్వరాల పేరుతో విపరీతంగా దోపిడీ పెరిగిపోయిందని, అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు. ప్రభుత్వ దావకానాలో తీవ్రమైన బెడ్స్ కొరత ఉందని విష జ్వరాలపై రోజురోజుకు సమీక్ష సమావేశాలు నిర్వహించి నివారణకు కృషి చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్ లో కనీసం కూడా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి పట్టించుకోవడంలేదని వారన్నారు. కనీస మౌలిక సౌకర్యాల కల్పనలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. హాస్టల్స్ లో రోజువారీగా వైద్యులు పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఐద్వా మండల అధ్యక్షకార్యదర్శిగా బోల్లం వసంత జంజీరాల ఉమా ఉపాధ్యక్షులు మంత్రాల మంగమ్మ మాలే భార్గవి సహాయ కార్యదర్శి సైదమ్మ పోకల ఝాన్సీ కోశాధికారిగా భీమగాని విజయలక్ష్మి, 13 మంది కమిటీ సభ్యులతో మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జ్యోతి సైదమ్మ లక్ష్మి ఎల్లమ్మ జానమ్మ అనిత ఈరమ్మ పద్మా వసంత తదితరులు పాల్గొన్నారు.



www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY

**సంపాదకీయం...**

# ఆసియాలో దారిద్య్రం, అసమానతల పెరుగుదల



ప్రభుత్వాలు పటిష్టమైన సామాజిక రక్షణ పథకాలను అమలు జరపనట్లయితే వచ్చే దశాబ్ది కాలంలో ఆసియాలో 26 కోట్ల మంది దారిద్య్రంలోకి దిగజారతారని మంగళవారం నాడు వెల్లడించిన ఐరాస నివేదిక హెచ్చరించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో దారిద్య్రం పెరుగుతోందని, అసమానతలు విస్తరిస్తున్నాయని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా చూసినపుడు ఈ ప్రాంతంలోని 45 శాతం జనాలకు సామాజిక భద్రతా పథకాలు అమలు కావటం లేదు. అమలు జరుగుతున్న పథకాలు కూడా ఎంత మందికి మేలు చేస్తున్నాయన్నది ప్రశ్న. ఈ నివేదిక ఆసియా గురించి చెప్పింది గనుక మనదేశం మినహాయింపు కాదు. మన కేంద్ర ప్రభుత్వం జాతీయ సామాజిక సహాయ పథకం సోషల్ ఆడిట్ 2023 నివేదికను విడుదల చేసింది. 1995 నుంచి ఈ పథకం అమలు జరుగుతోంది. దీనికి ఐదు ఉప పథకాలు ఉన్నాయి. వాటిలో ఒకటైన వృద్ధాప్య పెన్షన్ కింద అరవై సంవత్సరాలు నిండితే నెలకు రూ.200, 80 ఏళ్లు దాటితే రూ.500 ఇస్తున్నారు. ఈ మొత్తాలు ఏ మూలకు సరిపోతాయో పాలక పార్టీ పెద్దలు చెప్పాలి. ఆంధ్రప్రదేశ్‌లో నెలకు రూ. నాలుగు వేలు గరిష్టంగా ఇస్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో వెయ్యి రూపాయలకు మించి ఇవ్వటం లేదు.

ఇది కేంద్ర ప్రభుత్వ పథకమైనా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచకుండా పాతికేళ్ల నాటి మొత్తాలే ఇస్తున్నది. అంతర్జాతీయ సంస్థల దృష్టిలో ఇదొక ఉద్ధరణ పథకం. ఒకవైపు కోట్లాది మందిని దారిద్య్ర రేఖ నుంచి ఎగువకు తెచ్చి ఉద్ధరించినట్లు మోడీ తన జబ్బలను తానే చరుచుకుంటారు. మరోవైపు సామాజిక సంక్షేమం కింద 80 కోట్ల మందికి ఉచితంగా బియ్యం, గోధుమలు ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటారు. అంటే వారంతా దారిద్య్రంలో ఉన్నట్లే కదా! ఎందుకీ వంచన?విషాదకరమైన అంశం ఏమిటంటే%ా%అసలు దారిద్య్ర రేఖకు ప్రాతిపదిక ఏమిటన్న విషయం మీద ఇంతవరకు ఏకాభిప్రాయం లేదా ప్రమాణం లేదు. సాంకేతికంగా ఒక ప్రాతిపదికను గుర్తించినప్పటికీ అనేక దేశాల్లో దానికి ఎగువన వున్న అనేక కోట్ల మంది ఎప్పుడైనా దారిద్య్రంలో తిరిగి కూరుకుపోయే వారిగా వున్నారు. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచబ్యాంకు 2017లో దుర్భర దారిద్య్ర రేఖ ప్రమాణంగా రోజుకు పిపిపి పద్ధతిలో ప్రతి మనిషికి 1.9 డాలర్లుగా ఉన్నదాన్ని 2.15 డాలర్లకు పెంచి అంత కంటే తక్కువ ఆదాయం వచ్చేవారిని నిష్ట దరిద్రులుగా వర్గీకరించింది. మన కరెన్సీలోకి దీన్ని మార్చుకుంటే రోజుకు ప్రతి మనిషికి రూ.180 కంటే తక్కువ వచ్చే వారని అర్ధం. ఎవరికి వారు దీన్ని వర్తింప చేసుకొని తామెక్కడ ఉన్నదీ అర్ధం చేసుకోవచ్చు. భూతల స్వర్గం, ప్రపంచంలో అత్యధిక ధనవంతమైన దేశంగా పరిగణించే అమెరికాలో అంతకంటే తక్కువ రాబడి వచ్చేవారు 1.2 శాతం ఉన్నారు. ఈ కారణంగానే మన దేశంలో ఉచిత బియ్యం ఇస్తున్నట్లు అక్కడ పేదలకు ఆహార కూపన్లను ప్రభుత్వం ఇస్తున్నది. ఇళ్లు లేని వారు మన దేశంలో రోడ్ల మీద పడుకున్నట్లే అక్కడ పార్కుల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు కూడా ఉన్నారు. మన దేశాన్ని 2047 నాటికి ఎక్కడికో తీసుకుపోతామని చెబుతున్న నరేంద్ర మోడీ, ఆయనకు భజన చేసే ముఖ్యమంత్రులు కొలువై ఉన్న మన దేశంలో నిష్ట దరిద్రులు 12.9 శాతం (2022 సంవత్సరం సమాచారం) మంది ఉన్నారు. ఇది ప్రపంచ సగటు తొమ్మిది శాతం కంటే ఎక్కువ. అదే 3.65 డాలర్లను తీసుకుంటే 44 శాతం, 6.85 డాలర్లను తీసుకుంటే 81.8 శాతం ఉన్నారు. ప్రపంచ సగటును చూస్తే ఈ తరగతికి కిందకు వచ్చే వారు 9-22.4-44.9 శాతం వంతున ఉన్నారు. చైనాలో ఈ అంకెలు వరుసగా 0-0.1-17 (2020 సంవత్సరం ప్రపంచబ్యాంకు సమాచారం) శాతం మాత్రమే.ప్రపంచ బ్యాంకు సమాచారం ప్రకారం 2019లో 2.15 డాలర్ల కంటే తక్కువ వచ్చే వారు 64.8 కోట్ల మంది ఉన్నారు. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ చెబుతున్నదాని ప్రకారం రోజుకు 1.25 డాలర్ల కంటే తక్కువ ఆదాయం వచ్చేవారు ఆసియా-పసిఫిక్‌లో 70 కోట్ల మంది ఉన్నారు. నిజానికి ఈ 1.25 డాలర్లన్నది 1988 నుంచి 2005 వరకు 15 అతి పేద దేశాలలో ధరలు, కరెన్సీల విలువను పరిగణనలోకి తీసుకొని నిర్ణయించారు. దీనిలో అసియా నుంచి రెండు దేశాలను మాత్రమే తీసుకున్నారు. నాటికి నేటికి వచ్చిన తేడాను పరిగణనలోకి తీసుకుంటే దారిద్య్ర నిర్మూలన, దారిద్య్రరేఖ నిర్ణయం అంతా అంకెల గారడీ తప్ప మరొకటి కాదు.

## నీర్నెములలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు, యువతులు అంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో నీర్నెముల గ్రామంలో శ్రీ విగ్నేశ్వర అసోసియేషన్ యూత్ అమ్మవారి పరిసరాలు కాంతులీనాయి.

## అన్న జ్ఞాపకార్ధం చేతి కర్రల పంపిణీ.



**యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి :**

ఈ రోజు బతుకమ్మ పండుగ సందర్భంగా క్రీ.శే బోక్క పురెందర్ రెడ్డి జ్ఞాపకార్ధంగా ఎంబావి గ్రామంలోని వృద్ధులకు చేతికర్రలు బోక్క పురెందర్ రెడ్డి కుటుంబ సభ్యులు వృద్దులకు అందజేయడం జరిగింది ఇందుకుగాను గ్రామ ప్రజల పక్షాన వారి కుంటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### చంద్రప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు

తిరుమల, కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై దర్శనం ఇవ్వగా రాత్రి చందప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. దర్బార్ కృష్ణ అలంకారంలో స్వామివారు మాడ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించగా మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. వాహన సేవలో టీటీడీ ఈవో జె.శ్యామల రావు దంపతులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 79,753 మంది భక్తులు దర్శించుకోగా 29,623 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల మొక్కుల ద్వారా సమర్పించుకున్న కానుకలతో హుండీకి రూ. 3.48 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

# అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





## మేలవించిన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయం

**ములుగు, అక్షిత బ్యూరో**

ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బంగారు బతుకమ్మ బతుకు నిచ్చే తల్లి బతుకమ్మ, ఉయ్యాలో బతుకమ్మ , బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ గౌరమ్మ పాటలను ఆలపించారు. మా పిల్ల పాపలు ,పాడిపంటలు, విద్య ఆరోగ్యములనిచ్చిసుఖ సంతోషాలను ప్రసాదించి, మమ్ములను ఆశీర్వదించమంటూ గ్రామంలోని ముత్తయిదులు మహిళలు యువతులు, బతుకమ్మ పాటలతో గౌరమ్మను పూజించారు. డీజే పాటలతో నృత్యాలు చేశారు. ఉత్సాహంగా బతుకమ్మ పాటలు ఆలపిస్తూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ నృత్యాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. మల్లొచ్చే ఏడాదికి తీరక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి మరలా



కలుస్తామని, తెలుపుతూ వెళ్లిరా బతుకమ్మ వెళ్లి రావమ్మ గౌరమ్మ తల్లీ అంటూ మేళతాళాలతో ఘనంగా వీడ్కోలు పలికి మల్లూరు కోడలు చెరువులో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మల్లూరు కాలనీ పెద్దలు గడ్డం చిరంజీవి, ఏంపెల్లి శ్రీనివాస్, కొడారి, గడ్డం ఉపేందర్ రాంబాబు, గడ్డం హరినాథ్, గుద్దేటి శ్రీకాంత్, గడ్డం సుదర్శన్, గడ్డం సతీష్, గడ్డం ప్రశాంత్ గడ్డం మహేష్, ఏంపల్లి నాగేష్, కాలనీ యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

### అసోసియేషన్ వినతిని మన్నించిన ప్రభుత్వం

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**

రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు వెళ్లే విధంగా అవకాశం కల్పిచాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఏ) చేస్తున్న కృషి ఫలించింది. ఇప్పటికే ఇదే విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిసిఎల్ఏ నవీన్ మిట్టల్‌ను పలుమార్లు టిజిటిఏ నేతలు కలిసి ఎన్నికల బదిలీలపై వినతిపత్రాలను అందజేశారు. ఇటీవల రెవెన్యూ మంత్రితో జరిగిన ముఖాముఖి సందర్భంగా ఇదే విషయాన్ని టిజిటిఏ బలంగా చెప్పింది. ఎట్టకేలకు బదిలీలకు సంబంధించిన ఐచ్ఛికాలను ఇచ్చుకోవాలని తహసీల్దార్లకు అవకాశం ఇస్తూ సిసిఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల టిజిటిఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా అధ్యక్షురాలు పి.రాధ, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్సింగ్ చౌహాన్ రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ధన్యవాదాలు తెలిపారు. అర్హత, ఆసక్తి, అవకాశం ఉన్న ప్రతి తహసీల్దార్ బదిలీకి అవకాశం కల్పించాలని టిజిటిఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్సింగ్ చౌహాన్ కోరారు. ఎన్నికల బదిలీల విషయంలో ఇప్పటికే కొంత జాప్యం జరిగిందన్నారు.

## బోర్డు తిప్పేసిన సాఫ్ట్వేర్ కంపెనీ

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**

మాదాపూర్‌లో ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు వసూలు చేసి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ఆ సంస్థ పేరు సినార్జీ యూనివర్సల్ కంపెనీ. మాదాపూర్ కావూరి హిల్స్?లోని వివి చాంబర్స్ నాలుగో అంతస్తులో సినార్జీ యూనివర్సల్ కంపెనీ ఆఫీస్ ఉంది. ఉద్యోగాలు ఇస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి 3 లక్షల రూపాయలు వరకూ కంపెనీ యాజమాన్యం వసూలు చేసింది. ఆఫర్ లెటర్ చేతికిచ్చి వర్క్ ఫ్రం హోమ్ అని చెప్పి ఆరు నెలలు గడిపిన కంపెనీ యాజమాన్యం చివరకు ఇలా హ్యాండిచ్చింది. ఇలా సుమారు 500 మంది వద్ద నుంచి సినార్జీ యూనివర్సల్ కంపెనీ డబ్బులు వసూలు చేసింది. గత ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో కంపెనీ యాజమాన్యాన్ని ఉద్యోగులు ప్రశ్నించారు. కంపెనీకి ప్రాజెక్టులు లేవని ఉద్యోగులతో కంపెనీ యాజమాన్యం తెలిపింది. గత కొద్ది రోజుల నుంచి కంపెనీ యాజమాన్యం ఆఫీస్?కి రాకపోవడంతో మోసపోయామని ఉద్యోగులు ఆలస్యంగా గ్రహించారు. మోసపోయామని తెలుసుకొని మాదాపూర్ పోలీస్ స్టేషన్?లో ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. కంపెనీ చేసిన మోసం కోట్లలో ఉండడంతో ఇక్షచిలో (ఆర్థిక నేర విభాగం) ఫిర్యాదు చేయాలని మాదాపూర్ పోలీసులు బాధితులకు తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపనకు భాగస్వాములు కావాలి

### - కాంగ్రెస్ పార్టీ మండల నాంపల్లి అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి

**నాంపల్లి, అక్షిత న్యూస్:**



మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో శు క్రవారం నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేయుచున్నారని నాంపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాంపల్లి మండలంలోని అన్ని గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీలు,కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు కల్వకుంట్ల గ్రామానికి చేరుకుని ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమానికి అందరూ భాగస్వాములు అయ్యి, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఘనంగా సద్దల బతుకమ్మ



**యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి:**

యాదాద్రి భువనగిరి నాగిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం సద్దల బతుకమ్మ పూజలు ఘనంగా మొదలయ్యాయి. గునుగు, తంగేడు పూలతో పాటు సీతజడ, చామంతి, బంతి, గోరింట, గుమ్మడి, కట్లపూలు తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం కూడలి వద్ద బతుకమ్మలను ఏర్పాటు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులురావి సురేష్ రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుక్క స్వామి. కాంగ్రెస్ పార్టీ నాయకులు గాద కరుణాకర్ వాసగొని సాయి బొక్క శ్రీనివాస్ రెడ్డి వనగంటి బాలకృష్ణ గోపాల చారి తదితరులు పాల్గొన్నారు.



www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక

# ఆట



# బంగ్లాతో ఆఖరి టీ20లో ఆడేదెవరు?

**అక్షిత ప్రతినిధి :**

టెస్టు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. ఢిల్లీ వేదికగా బుధవారం జరిగిన రెండో టీ20లో ఆల్‌రౌండ్ షోతో సత్తాచాటి 86 పరుగుల పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పరుగుల పరంగా బంగ్లాదేశ్‌పై భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. ఇక మూడు టీ20ల సిరీస్‌లో మిగిలిన నామమాత్రపు ఆఖరి మ్యాచ్ హైదరాబాద్ వేదికగా శనివారం జరగనుంది. ఇప్పటికే టీ20 సిరీస్ గెలవడంతో బెంచ్ బలాన్ని పరీక్షించుకోవాలని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆఖరి టీ20లో భారత తుది జట్టులో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. నిరాశపరిచినప్పటికీ బ్యాకప్ ఓపెనర్లు లేకపోవడంతో సంజు శాంసన్, అభిషేక్ శర్మను చివరి టీ20లోనూ కొనసాగించనున్నారు. రెండో టీ20లో సంచలన ప్రదర్శన చేసిన యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిను కూడా జట్టులో కంటిన్యూ చేయనున్నారు. అయితే స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు విశ్రాంతి ఇవ్వాలని భావిస్తున్నారు. ఢిల్లీ మ్యాచ్‌లో హార్దిక్ కేవలం బ్యాటింగ్ మాత్రమే చేశాడు. అతనితో సూర్య బౌలింగ్ చేయించలేదు. కాగా, హార్దిక్ పాండ్య స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్, తెలుగు కుర్రాడు తిలక్ వర్మకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఆఖరి టీ20 మ్యాచ్‌లో ఇద్దరు తెలుగు ప్లేయర్లు భారత్ తరఫున బరిలోకి దిగనున్నారు. అలాగే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్థానంలో రవి బిష్ణోయ్ తిరిగి జట్టులోకి రానున్నాడు. మూడేళ్ల తర్వాత వరుణ్ భారత జట్టుకు ఎంపికవ్వడంతో తొలి రెండు మ్యాచ్‌ల్లో రవి బెంచ్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. దీంతో హర్షిత్ రాణా అరంగేట్రం చేయనున్నాడు. వాస్తవానికి శ్రీలంక సిరీస్ నుంచి బెంచ్‌కే పరిమితమవుతున్న హర్షిత్ ఇప్పటికే టీమిండియా జెర్సీ ధరించాల్సి ఉంది. కానీ ఈ కేకేఆర్ బౌలర్ హర్షిత్‌కు కెప్టెన్ సూర్య-కోచ్ గంభీర్ తుదిజట్టులో ఛాన్స్ ఇవ్వలేదు. ఉప్పల్ మ్యాచ్‌లోనూ హర్షిత్‌కు అవకాశం రాకపోతే.. ఈ కుర్రాడిని కేకేఆర్ రూ.4 కోట్లు తక్కువ ధరకే రిటైన్ చేసుకోవచ్చు. లేదంటే రూ.11 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

# 'స్వేచ్ఛగా ఆడు, ప్రతి బాల్ హిట్టింగ్ చెయ్యి

## రింకూ సింగ్ కు కోచ్ గౌతమ్ గంభీర్ సలహా

**అక్షిత ప్రతినిధి :**



మరో మ్యాచ్ మిగిలుండగానే బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది. ఢిల్లీ వేదికగా బుధవారం జరిగిన రెండో టీ20లో ఆల్‌రౌండ్ షోతో సత్తాచాటి 86 పరుగుల పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. పరుగుల పరంగా బంగ్లాదేశ్‌పై భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 221 పరుగుల భారీస్కోర్ చేసింది. అయితే భారత్ ఓ దశలో 43 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన రింకూ సింగ్(53బీ 29 బంతుల్లో, 5 ఫోర్లు, 3 సిక్సర్లు).. యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి(74బీ 34 బంతుల్లో, 4 ఫోర్లు, 7 సిక్సర్లు)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 108 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆఖర్లో హార్దిక్ పాండ్య (32బీ 19 బంతుల్లో, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. బంగ్లా బౌలర్లలో రిషద్ హొస్సేన్ మూడు, తస్కిన్ అహ్మద్, తంజీమ్ హసన్, ముస్తాఫిజుర్ తలో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 135 పరుగులకే పరిమితమైంది. మహ్మదుల్లా(41బీ 39 బంతుల్లో, 3 సిక్సర్లు) మినహా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, నితీశ్ రెడ్డి చెరో రెండు వికెట్లు, అర్షదీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ, మయాంక్ యాదవ్, రియాన్ పరాగ్ తలో వికెట్ తీసారు. కాగా, మ్యాచ్ అనంతరం రింకూ సింగ్ మాట్లాడాడు. ఒత్తిడిలో తాను గొప్ప ఇన్నింగ్స్ ఆడటానికి కారణం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ అని తెలిపాడు. వాళ్లు ఇచ్చిన సలహాతోనే ఇన్నింగ్స్ నిర్మించగలిగానని అన్నాడు. అయితే వారు చెప్పిన కేవలం ఒక్క మాటే అని రింకూ తెలిపాడు. 'స్వేచ్ఛగా ఆడు, ప్రతి బాల్ హిట్టింగ్ చెయ్యి' అని సూచించారని నయా ఫినిషర్ చెప్పాడు. "పరిస్థితులు ఎలా ఉన్నా నా ఆట నన్ను ఆడమని కోచ్, కెప్టెన్ చెప్పారు. జస్ట్.. ప్రతి బాట్ హిట్టింగ్ చెయ్యి అన్నారు. నా సామర్థ్యాన్ని విశ్వసిస్తూ ప్రతి బంతిని బాదాను. గంభీర్ భాయ్ నాకు ఈ స్వేచ్ఛను ఇచ్చాడు. నా బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎలాంటి క్లారిటీ ఉండదు. ఏ సమయంలో అయినా రావాల్సి ఉంటుంది. వికెట్లు త్వరగా పడిన సమయంలో నేను క్రీజులోకి వస్తే.. సింగిల్స్, డబుల్స్‌కు ట్రై చేస్తూ చెత్త బంతుల్ని బౌండరీలకు తరలిస్తా" "డెత్ ఓవర్లలో బ్యాటింగ్‌కు వస్తే బౌండరీలు, సిక్సర్లు బాదుతూ వీలైనంతగా ఎక్కువ పరుగులు చేయడానికి ప్రయత్నిస్తా. ఇక నాకెలాంటి ఆందోళన లేదు. మా టీమ్ ఆడే విధానం వల్ల మ్యాచ్ త్వరగా ముగుస్తుంది. గెలవడమే మాకు ముఖ్యం. ఇక రంజీ ట్రోఫీకి సన్నద్ధమయ్యే సమయం నాకు లేదు. అక్టోబర్ 12న ఆఖరి టీ20. కొన్ని రోజులే దొరుకుతున్నాయి. వైట్ బాల్ ఆడిన తర్వాత వెంటనే రెడ్ బాల్ క్రికెట్ ఆడటం అంత సులువుకాదు. లక్నోకు వెళ్లిన తర్వాత నెట్స్‌లో మరింతగా సాధన చేస్తాను. మూడు ఫార్మాట్లకు ఆడే సత్తా ఉంది. అవకాశం వస్తే నిరూపించుకుంటా" అని రింకూ సింగ్ పేర్కొన్నాడు.

# రిటైర్మెంట్ ప్రకటించిన రఫెల్ నాదల్

**అక్షిత ప్రతినిధి :**



టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్ ఆటకు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘమైన కెరీర్ ఆడిన నాదల్ గురువారం రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల ఈ స్పెయిన్ దిగ్గజం వచ్చే నెలలో జరిగే డేవిస్ కప్‌లో చివరిసారిగా బరిలోకి దిగి ఆటకు గుడ్‌బై చెప్పనున్నాడు. రఫెల్ నాదల్ 22 గ్రాండ్ స్లామ్ టైటిళు సాధించాడు. సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేసి రఫెల్ నాదల్ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. "మీతో ఓ విషయాన్ని పంచుకోవడానికి వచ్చాను. ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్ అవుతున్నాను. గత కొన్నాళ్లు.. ముఖ్యంగా గత రెండేళ్లు కష్టతరంగా సాగాయి. నేను పరిమితులు లేకుండా ఆడానని నేను అనుకోవట్లేదు" అని రఫెల్ నాదల్ భావోద్వేగంతో పేర్కొన్నాడు. గత కొంతకాలంగా గాయాలతో సతమతమవుతున్న నాదల్ ఈ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మూడింట పాల్గొనలేదు. చివరగా ప్యారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన నాదల్ నిరాశపరిచాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో సెర్బియా స్టార్ జొకోవిచ్ చేతిలో ఓడి ఇంటిబాట పట్టాడు. కాగా, ఓవరాల్‌గా రఫెల్ నాదల్ 22 గ్రాండ్ స్లామ్స్ టైటిళ్లు సాధించాడు. 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్, రెండు సార్లు వింబుల్డన్, నాలుగు సార్లు యూఎస్ ఓపెన్, రెండు సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లలో ఛాంపియన్‌గా నిలిచాడు. అంతేగాక రఫెల్ నాదల్ 2008 ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాడు. స్పెయిన్ తరఫున అనేక డేవిస్ కప్ విజయాలు, 90 ఏటీపీ టైటిళ్లు గెలిచాడు. బిగ్ త్రీలో..రోజర్ ఫెదరర్, నొవాక్ జకోవిచ్‌లపై నాదల్ అద్భుత పోరాటంతో అపూర్వ విజయాలు సాధించాడు.

# కఠిన ద్రవ్య వైఖరికి చెల్లు

## ఇకపై 'న్యూట్రల్' పాలసీనే

## తాజా ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం

## మున్ముందు వడ్డీరేట్ల తగ్గింపునకు సంకేతాలు

## వరుసగా 10వసారి రెపోరేటు యథాతథం

**ముంబై,**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇన్నాళ్లూ అవలంబించిన కఠిన ద్రవ్య విధానానికి స్వస్తి పలికింది. ఈ మేరకు బుధవారం ముగిసిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో నిర్ణయం తీసుకున్నది. ఇకపై 'న్యూట్రల్' పాలసీని అనుసరిస్తామని స్పష్టం చేసింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను ఇచ్చింది. కాగా, ద్రవ్య విధానంపై ఆర్బీఐ వైఖరిని కఠినం నుంచి తటస్థానికి మార్చేందుకు కొత్త సభ్యులతో కొలువుదీరిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లోని అందరూ అంగీకరించారు. 2019 జూన్ నుంచి చూసినైట్టైతే ఆర్బీఐ తటస్థ ద్రవ్య విధాన వైఖరిని తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ విధానంలో ద్రవ్యోల్బణం, జీడీపీ డాటాల ఆధారంగా వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచడం లేదా తగ్గించడం చేస్తుంది. ఆర్బీఐ ప్రధానంగా మూడు ద్రవ్య విధాన వైఖరిలను ప్రదర్శిస్తుంది. అందులో హాకిష్ పాలసీ ఒకటైతే, మరొకటి డోవిష్ పాలసీ. ఇంకొకటే న్యూట్రల్ పాలసీ. హాకిష్ పాలసీలో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను అధిక స్థాయిల్లోనే ఉంచుతుంది. వడ్డీరేట్లను పెంచడం తప్ప తగ్గించదు. ఇక డోవిష్ పాలసీలో జీడీపీ వృద్ధికి పెద్దపీట వేస్తుంది. మార్కెట్‌లో ద్రవ్య సరఫరా పెరిగేలా, రుణ లభ్యతను పెంచేలా వడ్డీరేట్లను తగ్గిస్తూ ఉంటుంది. కాగా, తదుపరి ద్రవ్యసమీక్ష డిసెంబర్ 4-6.

### 6.5 శాతం వద్దే రెపోరేటు

రెపోరేటును ఈసారి ద్రవ్యసమీక్షలోనూ 6.5 శాతం వద్దే ఉంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్నది. ఆరుగురు సభ్యులున్న ఎంపీసీలో ఐదుగురు దీన్ని సమర్థించారు. ఇది 10వసారి కావడం గమనార్హం. గత ఏడాది ఫిబ్రవరిలో 6.25 శాతం నుంచి 6.5 శాతానికి మార్చింది. ఆ తర్వాతి నుంచి ఇది అక్కడే ఉన్నది. దీంతో ఆటో, గృహ, కార్పొరేట్, వ్యక్తిగత, ఇతరత్రా రుణాలపై వడ్డీరేట్లూ తగ్గడం లేదు. రెపోరేటు ఆధారంగానే బ్యాంకులు తమ రుణాలపై వడ్డీరేట్లను సవరిస్తాయి. దీంతో ఆర్బీఐ ఆ రేటును తగ్గిస్తే ఆయా రుణాలపై వడ్డీరేట్లూ తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది. కరోనాతో పడకేసిన దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించిన ఆర్బీఐ.. ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి పెంచింది. అయితే రాబోయే రోజుల్లో ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్న ఆశలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు ద్రవ్య విధానం మారేందుకు దోహదం చేశాయి.

### ఎన్‌బీఎఫ్‌సీలకు హెచ్చరిక

కొన్ని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోని ప్రమోటర్లు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ సందర్భంగా హెచ్చరించారు. తమ సంస్థలను వేగంగా విస్తరించాలని, అభివృద్ధిపర్చాలని తప్పుడు దారుల్లో వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల రిస్క్ పెరుగుతుందని సూచించారు.

### రేట్ల తగ్గింపుపై ఇప్పుడే మాట్లాడలేం: దాస్

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణాన్ని ఎగదోసేలా ఉన్నాయని, కాబట్టి రాబోయే ద్రవ్యసమీక్షల్లో తప్పకుండా కీలక వడ్డీరేట్లు తగ్గుతాయని ఇప్పుడే చెప్పలేని పరిస్థితి అని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. సుదీర్ఘకాలంపాటు కఠిన ద్రవ్యవిధానాన్ని అవలంభించిన ఆర్బీఐ.. తాజా ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో దాన్ని వీడుతున్నట్టు ప్రకటించింది. వడ్డీరేట్లపై నిర్ణయంలో ఇకపై 'న్యూట్రల్' పాలసీని అనుసరిస్తామని స్పష్టం చేసింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న ఊహాగానాలు, అంచనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే దాస్ పైవిధంగా స్పందించారు. పరిస్థితులనుబట్టి వడ్డీరేట్ల యథాతథ స్థితి, తగ్గింపులపై నిర్ణయాలుంటాయని తేల్చిచెప్పారు. అయితే ద్రవ్యోల్బణంపై పోరులో ఇప్పటిదాకా ఆర్బీఐ వైఖరి ఏనుగులా సాగిందని, ఇక నుంచి గుర్రం మాదిరి దూకుడుగా ఉంటుందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇదిలావుంటే అధిక వడ్డీరేట్లతో వృద్ధిరేటుకు వచ్చే ముప్పేమీ లేదని దాస్ అన్నారు. గత ఏడాదిన్నర కాలంగా దేశ ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాలు బాగానే సాగుతున్నాయని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్-మార్చిలో అంచనాలను మించి వృద్ధిరేటు నమోదవుతుందన్న ఆశాభావాన్ని కనబర్చారు.

### డిజిటల్ లావాదేవీలకు కిక్కు

**యూపీఐ లైట్ వ్యాలెట్, యూపీఐ123పే ట్రాన్జాక్షన్స్ పరిమితి పెంపు**

**ఆర్టీజీఎస్, నెఫ్ట్ సిస్టమ్స్‌ల్లో కొత్త ఫీచర్**

దేశంలో డిజిటల్ చెల్లింపులను వీలైనంత ఎక్కువగా పెంచాలని చూస్తున్న ఆర్బీఐ.. తాజా ద్రవ్యసమీక్షలో ఆ మేరకు మరిన్ని కీలక నిర్ణయాలను తీసుకున్నది. ఇందులో భాగంగానే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లైట్ వ్యాలెట్‌కున్న పరిమితిని రూ.5,000కు పెంచింది. ప్రస్తుతం ఇది రూ.2,000గానే ఉన్నది. అలాగే ఒక్కో లావాదేవీకున్న పరిమితిని కూడా రూ.1,000కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పుడిది రూ.500లు మాత్రమే. ఇక యూపీఐ123పేలోనూ ఒక్కో లావాదేవీ పరిమితిని ప్రస్తుతమున్న రూ.5,000ల నుంచి రూ.10,000 పెంచుతున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలియజేశారు. స్మార్ట్‌ఫోన్లను వినియోగించని ఫీచర్ ఫోన్ యూజర్ల కోసం 2022 మార్చిలో యూపీఐ123ని అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడీ సౌకర్యం 12 భాషల్లో అందుబాటులో ఉన్నది. ఇదిలావుంటే రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ సిస్టమ్ (ఆర్టీజీఎస్), నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) సిస్టమ్స్‌ల్లో బెనిఫీషియరీ అకౌంట్ పేరు కనిపించే వెసులుబాటును తెస్తున్నట్టు దాస్ వెల్లడించారు. వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న విజ్ఞప్తుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి వడ్డీరేట్లను తగ్గిస్తే ఈ పండుగ సీజన్‌లో హౌజింగ్ డిమాండ్ పుంజుకొనేది. అటు రియల్ ఎస్టేట్ రంగంలో, ఇటు యావత్తు ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటును పరుగులు పెట్టించే ఓ మంచి అవకాశాన్ని ఆర్బీఐ చేజార్చుకున్నది.



www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక

# బిజినెస్..

## 15న హ్యుందాయ్ ఐపీవో

### రూ.27,870 కోట్లతో పబ్లిక్ ఇష్యూ

### షేర్ ధరల శ్రేణి రూ.1,865-1,960

**న్యూఢిల్లీ/ముంబై,**

హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ భారీ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 15న ప్రారంభం కానున్నది. దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా రూ.27,870 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) వస్తున్నది. షేర్ ధరల శ్రేణిని రూ.1,865-1960గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లను ఆకట్టుకొనేందుకు సంస్థ రోడ్‌షో నిర్వహించింది. ఈ సందర్భంగా కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పండుగ సీజన్‌లో కార్ల అమ్మకాలు బాగున్నాయన్నారు. అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం ఏమీ లేదన్నారు. కాగా, యాంకర్ ఇన్వెస్టర్ల కోసం షేర్ల బిడ్డింగ్ 14నే మొదలవుతుంది. 17న ముగుస్తుంది. ఇక ఈ ఐపీవోతో ఇప్పటిదాకా భారీది గా పేరున్న ఎల్ఐసీ రూ.21,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ రెండో స్థానంలోకి వెళ్లనున్నది.

HYUNDAI

# నూతనంగా ఎన్నికైన అందరికీ హార్థిక శుభాకాంక్షలు తెలిపిన. కొలన్ హన్మంత్ రెడ్డి..





**మేడ్చల్, అక్షిత బ్యూరో :**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ సహకార శాఖ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీ నూతనంగా ఎన్నికైన సందర్భంగా వ్యవసాయ, సహకార %ు% చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతనంగా ఎన్నికైన కమిటీ బొమ్మలపల్లి నర్సింహులు చైర్మన్ తున్కి బిక్షపతి డైరెక్టర్ గాదె వినోద్ డైరెక్టర్ ఈగ శ్వేతా డైరెక్టర్ ల కు శాలువాతో సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, రజాక్, ముక్కు రామారావు, బాల నర్సింహులు, వెంకట్ రెడ్డి, యూసఫ్, మల్లేష్, నర్సింహులు, భాను చందర్, రాజు పాల్గొన్నారు..

# ఢిల్లీ వాలా స్వీట్ షాప్ ను ప్రారంభించిన శంభీపూర్ క్రిష్ణ..





**మేడ్చల్, అక్షిత బ్యూరో :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పురపాలక మల్లంపేట్ 26వ వార్డు కెవిఆర్ వ్యాలీలో గురువారం.నూతనంగా ఏర్పాటు చేసిన ఢిల్లీ వాల స్వీట్ షాప్ ను ప్రారంభించిన కుత్బుల్లపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు నాణ్యతమైన ఆహార పదార్థాలు అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు..

# మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగ

ఆత్మకూర్- యస్ అక్షిత న్యూస్

సద్దుల బతుకమ్మ అన్నింటి కంటే చాలా విభిన్నంగా ఉంటుంది. ఎనిమిది రోజులతో పోలిస్తే తొమ్మిదో రోజు పేర్చే బతుకమ్మ చాలా పెద్దదిగా ఉంటుంది. ఇదే రోజు దుర్గాష్టమి పండుగ జరుపుకుంటారు. ఈ ఏడాది అష్టమి నవమి ఒకే రోజు వచ్చాయి. సద్దుల బతుకమ్మ రోజు ఎన్ని రకాల పూలు దొరికితే అన్ని రకాల పూలు అమర్చుకుంటూ ఎత్తైన బతుకమ్మ తయారు చేస్తారు. అలాగే పెద్ద బతుకమ్మతో పాటు చిన్న బతుకమ్మ కూడా పెట్టుకుంటారు. పసుపుతో గౌరీ దేవిని చేసి పూజిస్తారు. అమ్మవారిని పూజించిన తర్వాత పసుపు తీసుకుని మహిళలు ఒకరికొకరు రాసుకుంటారు.తొమ్మిదో రోజు సాగే సద్దుల బతుకమ్మ చూసేందుకు ఊరు వాడ అంతా ఒక చోటుకు చేరతారు. మహిళలు అందరూ ఉదయాన్నే నిద్రలేచి ఇల్లంతా శుభ్రం చేసుకుని ప్రకృతిలో దొరికే పూలు అన్నింటినీ తెచ్చుకుంటారు. తాంబూలం పళ్ళెం తీసుకుని అందులో అన్ని రంగుల పూలను వరుసలుగా పేర్చుకుంటూ ఉంటారు. కొందరు వలయాకారంలో పెడితే మరికొందరు గోపురం, స్తూపం ఆకారంలో అమర్చుకుంటారు. గునుగు పూలకు రంగులు అద్ది వాటిని ఉపయోగిస్తారు. బంతి,సీత జాడ, టేకు,గునుగు,తామర,చామంతి,గన్నేరు, వంటి అనేక పూలు ఆకులు కలిపి గౌరమ్మను పూజించి పల్లీలు,నువ్వులు,మక్కా జొన్నలు,బెల్లం చెక్కర తో చెడిన ప్రసాదాలు ఒకరికొకరు పంచుకుంటూ వాయినం ఇచ్చి పుచ్చుకుంటారు. బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బచ్చలకూరి సాలమ్మ అరుంధతి యూత్ గుర్రాల రాంబాబు దిలీప్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



# భౌరంపేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

**మేడ్చల్, అక్షిత బ్యూరో :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ పురపాలక పరిధి భౌరంపేట్ లో బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆచార, సంప్రదాయాలకు ప్రతీక.మన ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే పూల వేడుక యొక్క సంబరాన్ని అంబరంగా జరుపుకున్నారు. గ్రామంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి బౌరమ్మగుడి వద్ద. మహిళలు బతుకమ్మలతో ప్రాంగణం నిండింది. మరియు పెద్ద చెరువు గట్టు మీద బతుకమ్మలతో ఆడపడుచులు ఆడిపాడారు. వెళ్లి రావమ్మ..చల్లగా మళ్లీ రావమ్మా బతుకమ్మ. సంతోషంగా జరుపుకున్నారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...





# చినుకు పడితే చిత్తడే

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మురుగు కాల్వ నిర్మించకపోవడంతో మిర్యాలగూడ పట్టణంలో 23 వ వార్డు అశోక్ నగర్ కాలనీలో గత ఐదారు సంవత్సరాల నుండి కొద్ది వర్షం రాగానే ఇదే పరిస్థితి అనేక బైక్ మెకానిక్ ల షాపులలోనికి వర్షపు నీరు చేరుతున్నాయి. దీంతో మెకానిక్ లుసుమారు 10 వేలు 20వేల వరకు నష్టపోవడం జరుగుతున్నదనీ, వార్డులో గల ఇండ్లలోకి నీళ్లు ప్రవేశించి ప్రజలకు ఇబ్బంది కలగడం జరుగుతుందన్నారు. కాలువ నిర్మాణానికి గత ఐదు సంవత్సరాలు నుండి మేము కొట్లాడిన కాలువ నిర్మాణానికి చేపట్టలేదన్నారు. గత పాలకులు ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యానికి గురి చేయడం జరిగిందని ఇప్పటికైనా పాలకులు పట్టించుకోని కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని ఎఐఎంఐఎం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుక్, బిఎంపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య సమస్యను వివరించారు.





# ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్ తదితరులకు షాక్

## పలువురు ఐఎఎస్‌లను ఎపికి కేటాయింపు

## వెంటనే రిపోర్టు చేయాలని కేంద్రం ఆదేశాలు

హైదరాబాద్, అక్షిత న్యూస్

తెలంగాణలో కొనసాగుతున్న పలువురు ఐఏఎస్ అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఆయా ఐఏఎస్ అధికారులు వెంటనే ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఆమ్రపాలి కాట, విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్న రోనాల్డ్ రోస్, వాణిప్రసాద్, ప్రశాంతితో పాటు పలువురు అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కేడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు కేటాయించాలన్న ఐఏఎస్, ఐపీఎస్‌ల అభ్యంతరాలను తోసిపుచ్చింది. వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి, వాణీప్రసాద్, మల్లెల ప్రశాంతి తదితర అధికారులు తమను తెలంగాణకు కేటాయించాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. అయితే, వారందర్నీ తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది.ఈ మేరకు ఐఏఎస్ అధికారుల పేరుతో లేఖను రాస్తూ.. వాటి కాపీలను తెలంగాణ, ఏపీ చీఫ్ సెక్రెటరీలకు కేంద్రం పంపింది. అయితే, తెలంగాణ కేడర్ కావాలంటూ 11 మంది అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే, అధికారుల వినతిని కేంద్రం తిరస్కరించింది. అధికారులంతా సొంత రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన అనంతరం ఆమ్రపాలి కేంద్ర సర్వీసుల నుంచి తెలంగాణ సర్వీసుల్లో చేరారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ కమిషనర్‌గా కొనసాగుతున్న సమయంలోనే జీహెచ్‌ఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో ఎంతో మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ఆమెకే ఐదు కీలక పోస్టులను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారు. ఆ తర్వాత జరిగిన బదిలీల్లో మిగతా పోస్టులను నుంచి ఆమెను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి కాటా అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తనను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించింది. ఆమెను విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కు కేటాయిచారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో జాయినవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసి పుచ్చారు. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కే చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి,క్యాట్‌కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్ కుమార్ ఏపీలో సీఎస్‌గా ఉండగా కోర్టు ఏపీకి వెళ్లాల్సిదేనని స్పష్టం చేసింది. దాంతో ఆయన తెలంగాణ నంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అమ్రపాలికి కూడా దాదాపుగా అదే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ కమిషనర్ గా ఉన్న ఆమె ఉన్న పళంగా ఏపీలో రిపోర్టు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఖండేకర్ కమిటీ సిఫారసులు చేసిన సమయంలో స్థిర నివాసం అనే కాలమ్‌ను కీలకంగా తీసుకున్నారు. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో కాట అమ్రపాలి తన పర్మినెంట్ అడ్రస్‌గా విశాఖ పట్నంను పేర్కొన్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆ నివేదిక ఆధారంగా క్యాడర్ ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ ఆమెను ఏపీకి కేటాయించింది. అయితే తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి.. తెలంగాణకే కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ మొదట్లోనే ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. హైకోర్టు కూడా ఖండేకర్ కమిటీ ఆధారంగా ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫారసులనే అమలు చేయాలని స్పష్టం చేసింది. కాట అమ్రపాలికి ప్రస్తుతం అన్ని మార్గాలు మూసుకుపోయినట్లేనని ఆమె ఖచ్చితంగా తెలంగాణలో రిలీవ్ అయ్యి.. ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని భావిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరంగల్ జిల్లాకు కలెక్టర్ గా చేసిన అమ్రపాలి తర్వాత కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఓఎస్డీగా.. ప్రధానమంత్రి కార్యాలయంలోనూ పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తెలంగాణకు వచ్చారు రేవంత్ సర్కార్ లో ఆమెకు కీలక పోస్టులు దక్కాయి. అయితే ఇప్పుడు ఏపీకి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కెసిఆర్‌ను విమర్శించకుండా ఉండలేరా

## విమర్శలే మీ ప్రభుత్వ విధానమా

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ సబిత

హైదరాబాద్, అక్షిత న్యూస్


ఎక్కడ పడితే అక్కడ.. విద్యార్థులు, టీచర్ల ముందు కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా..? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. గడిచిన పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా..? అని అడిగారు. నిన్న డీఎస్సీ నియామక పత్రాల అందజేత సందర్భంగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శించిన తీరుపై సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి మాట్లాడేటప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమా లేక పార్టీ కార్యక్రమా మర్చిపోతున్నారు. మీరు ఇచ్చాం అని చెప్తున్న టీచర్ పోస్టులు కేసీఆర్ మంజూరు చేసినవి కావా..? ఉన్నత విద్యాశాఖలో 3202 పోస్టులు, యూనివర్సిటీలలో 1081 పోస్టులు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసినవి కావా..? అని సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. ఇంటర్, టెక్నికల్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగులను కేసీఆర్ రెగ్యులర్ చేశారు అని చెప్తే బాగుండేది. ఎన్నికల ముందు మీరు చెప్పిన 25,000 టీచర్ పోస్టులు ఎందుకు ఇవ్వలేదు అని ఆ గురువుల ముందు చెప్తే బాగుండేది. ఎన్నికలప్పుడు 6000 పాఠశాలలు మూతపడ్డాయి అని అబద్దం చెప్పిన మీరు, ఆ పాఠశాలల లిస్ట్ విడుదల చేస్తే బాగుండేది. మన ఊరు మన బడి కార్యక్రమం ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. 6 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్న కేసీఆర్ ప్రవేశ పెట్టిన గురుకులాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేద్దాం అనుకుంటున్నది అని చెప్తే బాగుండేది. ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. ఎన్నికల సమయంలో చెప్పినట్టు ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్తే బాగుండేది. 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న మీరు మిగితా పాఠశాలలను గాలికి వదిలేశాము అని చెప్తే బాగుండేది అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు.



www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY


www.aakshitha.com

సినిమా
CINEMA




# యానిమల్‌తో ప్రశంసలు ..విమర్శలూ ఎదుర్కొన్నా..నటి తృప్తి డిమ్రి వెల్లడి


యానిమల్' మూవీతో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్ననటి త్రిప్తి డిమ్రి ఆ సినిమా తర్వాత ఆమెకు బాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కాయి. తన తదుపరి చిత్రం 'విక్కీ విద్య కా వో వాలా వీడియో' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. 'యానిమల్' తర్వాత తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడారు. ఆ సినిమా వల్ల ఫేమ్ మాత్రమే కాదు విపరీతమైన విమర్శలు చూశానని అన్నారు.యానిమల్' విడుదలయ్యాక ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. జోయాగా యాక్ట్ చేసినందుకు నన్ను చాలామంది తిట్టారు. సోషల్‌మీడియా వేదికగా పలువురు నెటిజన్లు అసభ్యంగా ట్రోల్ చేశారు. వాటిని ఎలా తట్టుకోవాలో అర్థం కాలేదు. అలాంటి విమర్శలు ఎదుర్కొంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఎంతో బాధపడ్డా. మానసికంగా ఆవేదనకు గురయ్యా. దానినుంచి బయటకు రావడం కోసం మూడు రోజుల పాటు ఏడుస్తూనే ఉన్నా. దానివల్ల బాధ కాస్త తగ్గింది. మనసు శాంతించింది. ఆ సమయంలో నా సోదరి ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. నువ్వు ఏం చేశావో నీకు తెలుసు. కాబట్టి ఇతరుల మాటలు పట్టించుకోకు అని ధైర్యం చెప్పిందని తెలిపారు. రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం 'యానిమల్'. యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది తెరకెక్కింది. జోయాగా అలరించారు త్రిప్తి డిమ్రి. కథలో భాగంగా ఆమెపై కొన్ని ఇంటిమేట్ సీన్స్ చిత్రీకరించారు. ఆ సీన్స్‌పై పలువురు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత త్రిప్తికి దేశవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు. 'నేషనల్ క్రష్' అని ట్యాగ్ ఇచ్చారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమపై గతంలో ఓ సందర్భంలో మాట్లాడారామె. 'బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. 'లైలా మజ్ను' తర్వాత నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారని చెప్పారు.




# ఫీమేల్ లీడ్ రోల్‌గా సంయుక్త మూవీ

## క్లాప్ కొట్టిన నటుడు దగ్గుబాటి రానా

భీమ్లా నాయక్' సినిమాలో పవన్ కళ్యాణ్, నిత్యా మీనన్ ఒక జంటగా నటిస్తే.. మరో జంటగా రానా దగ్గుబాటి, సంయుక్త నటించారు. ఈ సినిమాలో నిత్యామీనన్ పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అంతే ప్రాముఖ్యత సంయుక్త పాత్రకు కూడా ఉంటుంది. ఆ పాత్రలు వారిద్దరికీ మంచి పేరునే తెచ్చిపెట్టాయి. ఇక ఇప్పటి వరకు హీరోల పక్కన నటిస్తూ సక్సెస్ అందుకుంటున్న సంయుక్త తొలిసారి ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ థ్రిల్లర్‌తో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమె ప్రధాన పాత్రలో నటించబోతున్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమవగా.. ఈ సినిమాకు క్లాప్‌ను 'భీమ్లా నాయక్'లో తనకు భర్తగా నటించిన రానా దగ్గుబాటి కొట్టారు. ఈ సినిమా వరుస బ్లాక్‌బస్టర్స్ సినిమాలతో అలరిస్తున్న టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి సెన్సేషనల్ హిట్ చిత్రాలను అందించిన సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 6గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సంయుక్తనే సమర్పిస్తోంది. బుధవారం రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.




# జనక అయితే గనక రిలీజ్ ట్రైలర్ విడుదల



టాలీవుడ్ కుర్ర హీరో సుహాస్ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నాడు. ఈ ఏడాది ఇప్పటికే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్న వదనం, శ్రీరంగ నీతులు, గొర్రె పురాణం అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాలను అందుకున్న ఈ యువ నటుడు ఇప్పుడు మళ్లీ ఒక కొత్త స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. సుహాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'జనక అయితే గనక' సినిమాకు సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తుండగా.. బలగం, లవ్‌మీ వంటి విభిన్న తరహా సినిమాల తర్వాత దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తే.. ఎల్‌కేజీ, యూకేజీలకే లక్షలు వసూలు చేస్తున్న ఈ కాలంలో ఒక మిడిల్ క్లాస్ యువకుడు(సుహాస్) తనకు పిల్లలు పుడితే వారిని ఎలా పెంచాలి, ఎలా చదివించాలి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఈ కాలంలో పిల్లలను పెంచడం కష్టమని పిల్లలు వద్దనుకుంటున్నా సుహాస్‌కు సడన్‌గా తన భర్య గర్భవతి అంటూ షాక్ ఇస్తుంది.

# వార్-2లో విలన్‌గా ఎన్టీఆర్

తారక్ లేటెస్ట్ ఫిల్మ్ 'దేవర' హిట్టవ్వడంతో ఆయన మరింత జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ ఎన్‌టిఆర్31తో పాటు యశ్ రాజ్ ఫిల్మ్స్ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ లోని వార్ 2 సినిమాలో పనిచేస్తున్నాడు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీయార్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో తారక్ –హృతిక్ రోషన్‌కు మధ్యలో భారీ యాక్షన్ ప్యాక్‌డ్ సీక్వెన్సెస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన ఓ అప్డేట్ బయటకొచ్చింది.. స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ ఫిల్మ్ షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా మేజర్ పోర్షన్ షూటింగ్ పూర్తయింది. ఎన్టీయార్, హృతిక్ రోషన్ మధ్య జరగనున్న యాక్షన్ ప్యాక్‌డ్ క్లైమాక్స్ ఒక్కటి ఇంకా బాకీ ఉంది. దీంతో వచ్చే ఏడాది నవంబర్‌లో ఈ పార్ట్‌ని చిత్రీకరించడానికి సినీ యూనిట్ సిద్ధమైంది. ప్రత్యేకమైన డైట్‌ని పాటిస్తూ ఇద్దరు హీరోలు కండలు తిరిగిన శరీరాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే వీరిద్దరి మధ్య 'హ్యాండ్ టూ హ్యాండ్' ఫైట్ సీక్వెన్సెస్ కూడా ఉండనున్నాయట. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా తర్వాత గ్లోబల్ స్టార్ అవతారమెత్తిన తారక్‌కి ఇది బాలీవుడ్ డెబ్యూ కావడం విశేషం.



# మహిళలు బతుకమ్మను ఒక దేవతగా పూజిస్తారు

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**చేర్యాల అక్టోబర్ 10 అక్షిత ప్రతినిధి:**




బతుకమ్మ సంబరాల్లో భాగంగా చేర్యాల పట్టణంలోని కుడి చెరువు వద్ద బతుకమ్మ సంబరాలు ఏర్పాట్లను గురువారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పరిశీలించినారు. మొదట పట్టణం లోని దేవి నవరాత్రోత్సవాలలో భాగంగా చావటి వద్ద దుర్గామాత మండపానికి ఎమ్మెల్యే చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ఒక్క తెలంగాణలోని మహిళా సోదరీమణులకు ముఖ్యమైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణలో పకృతి నుంచి వచ్చినటువంటి పూలని పూజించి ప్రకృతిపై మనకున్న ప్రేమను చూపిస్తూ మహిళలు తొమ్మిది రోజులుగా రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి దేవతగా కొలుస్తూ సంబరాలు జరుపుకుంటారని తెలిపారు. ఈ వేడుకల్లో మహిళా సోదరీమణులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగలైన బతుకమ్మ- దసరా పండుగలకు ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, చేర్యాల ప్రాంత ప్రజలందరూ సంతోషంగా ఈ పండుగలను జరుపుకోవాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని ఆకునూరు గ్రామ శివాలయంలో దేవి నవరా త్రోత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ చైర్ పర్సన్ ఏ స్వరూప రాణి, కౌన్సిలర్లు, కమిషనర్ నాగేందర్, రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆడిన తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి...

**జనగామ, అక్షిత ప్రతినిధి:**



తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు రంగు బాల లక్ష్మి గురువారం జిల్లాలో పర్యటించి బతుకమ్మ కుంటలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో పాల్గొని తోటి మహిళలతో బతుకమ్మ ఆడారు.జిల్లాకు విచ్చేసిన బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మికి బతుకమ్మ కుంట వద్ద ఆర్డిఓ కొమరయ్య , డిసిపి రాజమహేంద్ర నాయక్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్లు...మర్యాదపూర్వకంగా మొక్కను అందించి ఆమెను స్వాగతించారు.మున్సిపల్ ఆధ్వర్యంలో బతుకమ్మ కుంటలో బతుకమ్మ సంబరాలు నిర్వహించగా బీసీ కమిషన్ నెంబర్ బాలలక్ష్మి పాల్గొని మహిళలతో లయబద్ధంగా నృత్యం చేసి స్ఫూర్తినిచ్చారు.ఈ వేడుకలలో జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని బతుకమ్మ వేడుకలను తిలకించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకన్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వార్డ్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పద్మాక్షి గుండాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్



**వరంగల్, అక్షిత బ్యూరో:**

సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని పోలీస్ బందోబస్తు ఏర్పాట్ల పై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేశారు. ఇందులో భాగంగా పద్మాక్షి గుండాన్ని సందర్శించి భద్రత ఏర్పాట్ల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యం బతుకమ్మ నిమజ్జనం చేసే సమయం మహిళలను అప్రమత్తం చేయడంతో పాటు పోలీస్ సిబ్బందిని నిమజ్జన ప్రదేశంలో విధులు నిర్వహించే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, హనుమకొండ ఇన్స్ స్పెక్టర్లు సతీష్,సీతారెడ్డి, సుజాత పాల్గొన్నారు.

# సింగపురం ఇందిరను కలిసిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు...

**జనగామ, అక్షిత ప్రతినిధి:**

జనగామ మార్కెట్ నూతన కమిటీ సభ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో స్టేషన్గన్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి సింగపురం ఇందిర గారిని హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ పై నమ్మకముంచి ఇంత పెద్ద బాధ్యతను ఇవ్వడానికి సహకరించినందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మీ ఆశీర్వాదంతో మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని వారు అభిప్రాయపడ్డారు. వారు ఇందిర గారికి కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ కొల్లూరు నరసింహులు, కమిటీ సభ్యులు శీలం కొండల్ రెడ్డి, బానోతు భాస్సీ, నమల శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, బొట్రెడ్డి శ్రీలత రెడ్డి, మహమ్మద్ బస్మియా, నీలం మోహన్, బండ కుమార్, తోటకూర రమేష్, గాదె రమేష్, వంగపల్లి శ్రీనివాస్, నాగబండి రవీందర్ కలిశారు.



# వాడ వాడలా బతుకమ్మ




**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణం, మండలం వాడ వాడలా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు వర్షం కారణంగా గురువారం రాత్రి ఘనంగా నిర్వహించలేక పోయారు. మధ్యాహ్నం నుండి భారీ వర్షం కురిసి తెరపి ఇచ్చి సాయంత్రం నుండి ముసురు వర్షం పడుతున్నది. అయినా ఒక మోస్తరు నుంచి భారీ సద్దుల బతుకమ్మలను రంగు రంగుల పూలతో అలంకరించి పూజలు చేసి ఆడుతున్న ప్రదేశానికి తీసుకు వచ్చారు. పట్టణంలోని ఈదులగూడ, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం అవరణ, సంతోష్ నగర్, శాంతినగర్, షాబునగర్, గాయత్రి నగర్, ఎన్ఎస్పీ క్యాంపు ఉత్సవ షెడ్ల కింద, ఫంక్షన్ హాలుల్లో, అపార్ట్మెంట్ల ఆవరణలలో ఇంకా అనేక చోట్ల వర్షం కురుస్తున్న సీతారామ మందిరం ముందు, కురియని ప్రాంతాలను ఎంపిక చేసి మహిళలు పిల్లలతో కలిసి డిజె బతుకమ్మ పాటలపై కొంతమంది ఆడగా, మరి కొన్ని చోట్ల మహిళలు పాడుతూ చప్పట్లు కొడుతూ ఆడారు. ఆయా ప్రాంతాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు నాగలక్ష్మి భార్గవ్, ఆర్యవైశ్య సంఘం మహిళా నాయకులు రాయపుడి భవానీ, శాలిగౌరారం ఎంపిడిఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, సిఐటియు అంగన్వాడి టీచర్స్ యూనియన్ అధ్యక్షులు బొందు పార్వతి, బిసి మహిళా నాయకులు పందిర్ల పద్మావతి, శైలజ, జ్యోతి, శ్యామల, ఇందిరా, సరితలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి కె. రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో వన్ టూ టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు కోట కరుణాకర్, పి. నాగార్జున, కే. వీరబాబు, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

# మహిళలు బతుకమ్మను ఒక దేవతగా పూజిస్తారు

## మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్ రెడ్డి

**సూర్యాపేట,అక్షిత ప్రతినిధి:**





సూర్యాపేట పట్టణంలోని సద్దలచెరువు బతుకమ్మ చౌరస్తా వద్ద అంగరంగ వైభవంగా జరిగింది గురువారం మాజీ మంత్రి



సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్ రెడ్డిమాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ఒక్క తెలంగాణలోని మహిళా సోదరీమణులకు ముఖ్యమైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణలో పకృతి నుంచి వచ్చినటువంటి పూలని పూజించి ప్రకృతిపై మనకున్న ప్రేమను చూపిస్తూ మహిళలు తొమ్మిది రోజులుగా రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి దేవతగా కొలుస్తూ సంబరాలు జరుపుకుంటారని తెలిపారు. ఈ వేడుకల్లో మహిళా సోదరీమణులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగలైన బతుకమ్మ- దసరా పండుగలకు ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, సూర్యాపేట మున్సిపల్ చైర్మను మున్సిపల్ కౌన్సిలర్లు మండల నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు, పాల్గొన్నారు.

# శ్రీకనకదుర్గ కాళీమాత ఆలయంలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**

విజయదశమి సంధర్భంగా మియాపూర్ బస్ బాడి వద్ద శ్రీకనక దుర్గ కాళీ మాత ఆలయం లో ప్రతీ సంవత్సరం కన్నుల పండుగగా నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజున భవానీ మాల ధారణ వేసిన భక్త జన శరణుఘోష తో ప్రతిధ్వనించింది శ్రీ కనక దుర్గా కాళీమాత ఆలయ చైర్మన్, కాళీమాత పూజారి సందీప్ మహారాజ్ ఆద్వర్యంలో అమ్మవారికి గాజులతో అలంకరణ చేసి హెూమం, సాయంత్రం కుంకుమార్చన లతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. భక్తులు అమ్మవార్ల సేవలలో పాల్గొనాలనే భక్తి పారవశ్యంతో వేలాదిగా భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చారు. అమ్మవారి ఆలయాల నిర్వహణ కమిటీ వారు మాట్లాడుతూ భక్తుల, ఆలయకమిటీ సభ్యుల సౌజన్యంతో ముందు ముందు ఆలయములను అభివృద్ది చేస్తామని ధార్మిక కార్యక్రమాలలో పాల్గొని అమ్మల ఆశీర్వాదములు తీసుకొని పునీతులు అవ్వాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

చేర్యాల అక్టోబర్ 10 అక్షిత ప్రతినిధి: బతుకమ్మ సంబరాల్లో భాగంగా చేర్యాల పట్టణ మరియు అన్ని గ్రామాలలో గురువారం 9వ రోజు సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా బతుకమ్మ పండుగ వచ్చిందంటే తొమ్మిది రోజులపాటు అడవిలోకి వెళ్లి తిరక్క పూలు తీసుకొని, బతుకమ్మ ను పేర్చి గ్రామంలోని చిన్న పెద్ద తేడా లేకుండా ఊరిలో ఉన్న మహిళలంతా ఒకచోటకు చేరుకొని బతుకమ్మను ఒక దేవతగా కొలుస్తూ, ఉయ్యాల పాటలతో- కోలాటాలు చేస్తూ, చివరి రోజు సద్దుల బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేసి పసుపు కుంకుమతో పోయి రావమ్మ బతుకమ్మ అని పాడుతూ సాగనంపుతారు. ఈ బతుకమ్మ సంబరాలను ప్రతి గ్రామంలోని వాడవాడలా కుల మత భేదం లేకుండా అందరూ మహిళలు కలిసికట్టుగా ఉయ్యాల పాటలతో ఆడుతూ ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించినారు. ఈ బతుకమ్మ సంబరాల్లో ప్రతి గ్రామంలో చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామస్తులు భారీగా తరలి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



# బతుకమ్మ తెలంగాణ మహిళల గుండె చప్పుడు...

## వెళ్లి రావమ్మా చల్లంగా.... మళ్ళీ రావామ్మ బతుకమ్మ

## అవాంఛ నీయ సంఘటనలు జరుగ కుండా పోలీస్ ల గట్టి బందోబస్త్

## మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల

**కోదాడ అక్షిత ప్రతినిధి**

బతుకమ్మ తెలంగాణ మహిళ ల గుండె చప్పుడు అని కోదాడ మునిసిపల్ ఛైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్ అన్నారు.గురువారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల లో చివరి రోజు సద్దల బతుకమ్మ వేడుకలు ప్రారంభించి మాట్లాడారు.పూలను దేవతలు గా భావించి పూజించే పెద్ద పండుగ బతుకమ్మ అన్నారు. కాగా బతుకమ్మ ఆట.. పాట కు పట్టణ మహిళలు కదం తొక్కారు. మహిళ తో పాఠశాల ప్రాంగణం కిక్కిరిసింది. అవాంఛ నీయ సంఘటన లు జరుగకుండా పట్టన సిఐ రాము, గ్రామీణ సిఐ రజిత రెడ్డి గట్టి బందో బస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ రమాదేవి,మహిళా నాయకులు నూనె సులోచన, చందా నిర్మల శైలజా, కౌన్సిలర్ లు ఉన్నారు.



బతుకమ్మ ఆట.. పాట కు

కదం తొక్కిన మహిళలు

మహిళలతో నిండిన ప్రాంగణం



Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published at H.No.7-1059/1,Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana. Editor : Mathangi Guruvaiah, Email : akshithadaily@gmail.com, Cell: 9000556444 RNI NO.APTEL/2011/37073

## ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగ



వార్త 8లో

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
తెలుగు జాతీయ దినపత్రిక
15th Anniversary

# తెలంగాణ దిక్సూచి

శుక్రవారం, 11 అక్టోబర్ 2024 | పేజీలు : 8

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పని చేయాలి

- -రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- -సంక్రాంతి నాటికి మద్దులపల్లి మార్కెట్ యార్డ్ పెండింగ్ పనులు పూర్తి
- -సన్న రకం వడ్లకు క్వింటాల్ 500 రూపాయల బోనస్
- -రైతులకు పూర్తి ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి పంటల బీమా పథకం అమలు
- -రైతులు లాభదాయక పంట ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి
- -మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు

పేజీ 2లో





## విద్యార్థులకు పెన్నులు పుస్తకాల పంపిణీ..అభినవ యూత్ అసోసియేషన్

వార్త 8లో



## కోలాట బృందానికి చీరల పంపిణీ

వార్త 8లో

## జాతిపిత విగ్రహానికి రంగులు

పెన్ పహాడ్ అక్షిత న్యూస్

మండల పరిధిలోని చీదేళ్ల గ్రామంలో 1949 లో నిర్మించి ప్రారంభించిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి రంగులు పోయి వెలవెల పోతుండటంతో దాన్ని చూసి చలించిపోయిన అదే గ్రామానికి ఉపాధ్యాయ దంపతులు పరెడ్డి శోభ వీరారెడ్డిలు రంగులు వేయించి మాజీ ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి చేతుల మీదుగా గురు వారం పున: ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగులు వేపించిన ఉపాధ్యాయ దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ వరికల్లు శ్రీనివాస్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు మాజీ సింగిల్ సైదులు యర్రమళ్ళ వెంకటయ్య కామల్ల వీరయ్య, వెన్న సైదిరెడ్డి, నూతన ఉపాధ్యాయులు సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# సంకల్పానికి సాదృశ్యం...

## చదువుకు పేదరికం అడ్డు కాదు..



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :

చదువుకు పేదరికం అడ్డు కాదు..ఎలాంటి ఆదరణ లేకున్నా స్వయంకృషితో మొదటి ప్రయత్నంలోనే డీఎస్సీ సాధించిన యువకుడు .. నల్గొండ జిల్లా సుబ్బరెడ్డిగూడెంకి చెందిన మంద కృష్ణకుమార్ తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో పదో తరగతి తర్వాత కుటుంబ పోషణ కోసం పదేళ్లు చదువు మానేశాడు. అనంతరం ఉద్యోగమే లక్ష్యంగా 2008లో మళ్లీ చదువు ప్రారంభించి, ట్యూషన్లు చెప్పుకుంటూ ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ పూర్తి చేశాడు. 2024 డీఎస్సీలో మొదటి ప్రయత్నంలోనే 71.53 మార్కులతో ఎస్సీ కేటగిరీలో జిల్లా ఫస్ట్ ర్యాంకుతో ఇంగ్లీష్ విభాగం (స్కూల్ అసిస్టెంట్ ) లో ఉద్యోగం సాధించి కష్టాల విజేతగా నిలిచాడు. కృష్ణ కుమార్ ను పలువురు అభినందించారు.





## నేలకొండపల్లిలో రాయల నాగేశ్వరావు పరామర్శలు

వార్త 8లో

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పని చేయాలి

-రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

-సంక్రాంతి నాటికి మద్దులపల్లి మార్కెట్ యార్డ్ పెండింగ్ పనులు పూర్తి

-సన్న రకం వడ్లకు క్వింటాల్ 500 రూపాయల బోనస్

-రైతులకు పూర్తి ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి పంటల బీమా పథకం అమలు

-రైతులు లాభదాయక పంట ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

-మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు



**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

రైతుల సంక్షేమమే లక్ష్యంగా నూతన మార్కెట్ కమిటీ పని చేయాలని రైతులకు మద్దతు ధర అందేలా కృషి చేయాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు అన్నారు. గురువారం మంత్రులు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.మంత్రుల సమక్షంలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా నియమించబడిన బైరు హరినాథ బాబు ఉపాధ్యక్షులుగా నియమితులైన వి నరేందర్ రెడ్డి ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నిబద్దత కలిగిన కార్యకర్తలను గుర్తించి పదవులు అందిస్తున్నామని అన్నారు. మద్దులపల్లి మార్కెట్ పూర్తి చేసేందుకు 20 కోట్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు.గతంలో తనకు పాలేరు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చినప్పుడు ఇక్కడ ఉన్న త్రాగు నీరు సాగు నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించామని తిరుమలాయపాలెం మండలంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించడంతో ఎకరానికి కోట్ల రూపాయల విలువ కలిగిందని అన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న పాలేరు నియోజకవర్గాన్ని అత్యంత సాగునీరు వసతి కలిగిన ప్రాంతంగా తీర్చిదిద్దామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఉన్న నదుల మీద చెక్ డ్యాంలు బ్రిడ్జి లు కట్టామని అన్నారు. ఇంటింటికి నల్లా పెట్టి త్రాగు నీరు అందించామని అన్నారు. కాల్వ క్రింద లేని మండలాలు పామాయిల్ సాగు చేయాలని, రైతులు మరింత లాభం పొందుతారని మంత్రి తెలిపారు.పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి నలు వైపులా జాతీయ రహదారి వచ్చాయని, అన్ని గ్రామాలకు రోడ్లు వచ్చాయని అన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ క్రింద వచ్చిన పదవులు రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో వినియోగించాలని అన్నారు. పాలేరు నియోజకవర్గానికి ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మన రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రుణమాఫీ క్రింద 18 వేల కోట్ల మాఫీ చేశామని మంత్రి తెలిపారు. 2 లక్షల పైన ఉన్న రుణాలు ఉన్న రైతులకు షెడ్యూల్ ప్రకటించి రుణమాఫీ పూర్తి చేస్తామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సన్నాలు పండించే రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ప్రకటించామని అన్నారు. రైతుల పంటలకు కూడా పంటల భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. రుణమాఫీ పథకం తర్వాత రైతు భరోసా పథకం అమలు అవుతుందని అన్నారు.క్వింటాల్ కు వెయ్యి రూపాయలు నష్టం వచ్చినప్పటికీ తడిచిన పెసర్లను మద్దతు ధరపై కొనుగోలు చేశామని తెలిపారు.మొక్కజొన్నలు సోయా పొద్దు తిరుగుడు కందులు ఎర్ర జొన్నలు మొదలగు పంటలకు మార్కెట్ లో ధర లేని సమయంలో వేల కోట్ల నష్టం వచ్చినప్పటికీ రైతులను నిలబెట్టాలని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఖమ్మం మార్కెట్ కు వచ్చే ఓవర్ లోడ్ ను మద్దులపల్లి మార్కెట్ గ్రహిస్తుందని అన్నారు. మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ పెండింగ్ పనులు 3 నెలలో పూర్తి చేసి సంక్రాంతి నాటికి మార్కెట్ ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని అన్నారు. 6 నెలల సమయంలో 4 గ్యారెంటీ అమలు చేశామని అన్నారు. 27 రోజులో సుమారు 18 వేల కోట్ల రుణాలు 24 లక్షల మంది రైతులకు మాఫీ చేశామని అన్నారు. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణాలు షెడ్యూల్ ప్రకారం చెల్లిస్తే పెండింగ్ రుణమాఫీ నిధులు సైతం ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని వర్గాల విద్యార్థుల కోసం 25 ఎకరాలలో సమీకృత గురుకులాల నిర్మాణం చేస్తున్నామని శుక్రవారం మొదటి విడత సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి నెలాఖరు నాటికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయల సహాయం అందిస్తామని అన్నారు.చెరువుల ఎఫ్టిఎల్ బఫర్ జోన్లలో పెద్ద పెద్ద బంగ్లాలు కట్టుకున్న బడా బాబుల నిర్మాణాలపై హైకోర్టు అనేక సార్లు అక్షింతలు వేసినప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించు కోలేదని తమ ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని అక్రమ



నిర్మాణాలను తొలగిస్తుందని అన్నారు.పేదలకు అండగా ఉండే అంశంలో ప్రజా ప్రభుత్వం ముందు ఉంటుందని త్వరలోనే ధరణిని రద్దుచేసి నూతన ఆర్ఓఆర్ చట్టం ప్రవేశపెట్టి భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ లు రాయల నాగేశ్వరరావు జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు....



**జనగామ, అక్షిత ప్రతినిధి:**

సద్దుల బతుకమ్మ సందర్భంగా గురువారం జనగామ లోని బతుకమ్మ కుంట ప్రాంతంలో బతుకమ్మ సంబరాల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొనాలని కమిటీ సభ్యులు చేసిన అభ్యర్థన మేరకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ కుంటకు చేరుకొని అక్కడ ఆడపడుచులతో కలిసి వారి ఆటపాటలతో మమేకమ య్యారు . ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ పండుగ అని ఇది ప్రకృతి పండుగని ఆయన అన్నారు. ఈ పండుగ సంబరాలలో జనగామ పట్టణానికి చెం దిన అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

# పువ్వులను పూజిస్తూ- ప్రకృతిని ఆదరించే గొప్ప పండుగ మన బతుకమ్మ .. బలరాం యాదవ్

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి ..**

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం తెలంగాణ పూల తో దేవుళ్ళ ను పూజించే సంస్కృతి లో పూలనే పూజించే తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను తెలిపే ఘనమైన పండుగ సద్దుల బతుకమ్మ ను శ్రీరాం నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎ బ్లాక్ మాజీ అధ్యక్షులు బలరాం యాదవ్ ఆద్వర్యంలో కన్నుల పండుగ గా గురువారం రోజు హనుమాన్ గుడి వెనకాల సద్దుల బతుకమ్మ సంబరాలు సాయంత్రం 6 గంటల కు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శు భాకాంక్షలు తెలిపారు

బలరాం యాదవ్



# దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేసిన జంగిటి నరేష్...

**జనగామ, అక్షిత ప్రతినిధి:**



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని నారాయణపురం గ్రామంలో దుర్గామాతకు జనగామ నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ సతీ సమేతంగా గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనగామ, చేర్యాల ప్రాంత అభివృద్ధి ప్రదాత, అపర భగీరథుడు పేద ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నా మన ప్రాంత ముద్దు బిడ్డ మాజీ ఎమ్మెల్యే జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డికి ప్రజా పాలన ప్రభుత్వంలో శాసన మండలి సభ్యత్వం ఇచ్చి గౌరవించినట్లయితే ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు పేద ప్రజల గొంతుకను వినిపించడం లో ముందు ఉండడమే కాకుండా... జనగామ నియోజక వర్గన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తూ రాష్ట్రం లోనే అత్యున్నత స్థానంలో ఉంచుతారన్నారు . పేద ప్రజల సంక్షేమ అభివృద్ధి పథకాలు మారుమూల గ్రామాలకు తీసుకుపోవడంలో ముందు ఉండే నాయకులు కాబట్టీ కొమ్మూరి ప్రతాపరెడ్డికి సముచిత స్థానం కల్పించాలని ప్రత్యేక పూజలు నిర్వహించానని అన్నారు. ఈ సందర్భంగా మండల మహిళలకు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు.






వలిగొండ మండలం అరూర్ గ్రామంలో బతుకమ్మ తీసుకెళ్తున్న చాడ శోభ, చాడ తనీష్క

# వరంగల్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగ

## తీరొక్క పులతో అలాంకరించి జాతర చేసిన ఆడపడుచులు

**వరంగల్, అక్షిత బ్యూరో:**

సద్దుల బతుకమ్మ అన్నింటి కంటే చాలా విభిన్నంగా ఉంటుంది. ఎనిమిది రోజులతో పోలిస్తే తొమ్మిదో రోజు పేర్చే బతుకమ్మ చాలా పెద్దదిగా ఉంటుంది. ఇదే రోజు దుర్గాష్టమి పండుగ జరుపుకుంటారు. ఈ ఏడాది అష్టమి, నవమి ఒకే రోజు వచ్చాయి. సద్దుల బతుకమ్మ రోజు ఎన్ని రకాల పూలు దొరికితే అన్ని రకాల పూలు అమర్చుకుంటూ ఎత్తైన బతుకమ్మ తయారు చేస్తారు. అలాగే పెద్ద బతుకమ్మతో పాటు చిన్న బతుకమ్మ కూడా పెట్టుకుంటారు. పసుపుతో గౌరీ దేవిని చేసి పూజిస్తారు. అమ్మవారిని పూజించిన తర్వాత పసుపు తీసుకుని మహిళలు ఒకరికొకరు రాసుకుంటారు. తొమ్మిదో రోజు సాగే సద్దుల బతుకమ్మ చూసేందుకు ఊరు వాడ అంతా ఒక చోటుకు చేరతారు. మహిళలు అందరూ ఉదయాన్నే నిద్రలేచి ఇల్లంతా శుభ్రం చేసుకుని ప్రకృతిలో దొరికే పూలు అన్నింటినీ తెచ్చుకుంటారు. తాంబూలం పళ్ళెం తీసుకుని అందులో అన్ని రంగుల పూలను వరుసలుగా పేర్చుకుంటూ ఉంటారు. కొందరు వలయాకారంలో పెడితే మరికొందరు గోపురం, స్తూపం ఆకారంలో అమర్చుకుంటారు. గునుగు పూలకు రంగులు అద్ది వాటిని ఉపయోగిస్తారు. బంతి,సీత జాడ, టేకు,గునుగు,తామర,చామంతి,గన్నేరు, వంటి అనేక పూలు ఆకులు కలిపి గౌరమ్మను పూజించి పల్లీలు,నువ్వులు,మక్కా జొన్నలు,బెల్లం చెక్కర తో చెడిన ప్రసాదాలు ఒకరికొకరు పంచుకుంటూ వాయినం ఇచ్చి పుచ్చుకుంటారు. వరంగల్ భద్రకాళీ, దేశాయిపెట్ చిన్న వడ్డేపల్లి,గోపాలస్వామి గుడి తోట మైదానం,ఖిల వరంగల్,పద్మాక్షి గుండ్రం, సోనిడి మాటు చెరువు లలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాలడుగుల నిర్మల,నిఖిత, సాత్త్విక,చిన్ని,రమాదేవి,వసంత తదితరులు పాల్గొన్నారు అనంతరం ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందించారు.







# ట్యాంక్ బజార్ నందు ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**చింతలపాలెం అక్షిత ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ ట్యాంక్ బజార్ నందు సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ వేడుకలలో పాల్గొన్న మహిళలు రకరకాల పూలతో బతుకమ్మలు పేర్చి ట్యాంక్ బజారు మధ్యలో బతుకమ్మలను ఉంచి ఆటపాటల మధ్య కోలాట నృత్యాల అనంతరం బతుకమ్మలు తయారుచేసిన ప్రతి మహిళకు బహుమతులు అందించడం జరిగింది .చివరిగా బతుకమ్మ బతుకమ్మ పండుగ యొక్క సారాంశాన్ని మహిళలకు వినిపించి డీజే కోలాటాల నడుమ మహిళలు సద్దుల బతుకమ్మలను నీటిలో కృష్ణమ్మ చెంతకు చేర్చడం జరిగింది .



# ఆప్తమిత్రుడు బొప్పన గాంధీ కి ఘన నివాళ్లు అర్పించిన మాజీ ఎంపీ నామ

## -మిత్రుడి బొప్పన గాంధీ పాడే మోసిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం /అక్షిత బ్యూరో :**

ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బొప్పన గాంధీ మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభపక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. చిరకాల మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధిలో గాంధీ చేసిన కృషి మరువలేనిదని పరిశ్రమను ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర విశేషమని అభినందించారు.కొద్ది రోజుల క్రితం అమెరికాలో మృతి చెందిన బొప్పన గాంధీ భౌతికకాయాన్ని గురువారం నాడు ఖమ్మం నగరంలోని బ్యాంకు కాలనీలోని సృజన అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారి నివాసానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు నామ సోదరుడు శీతయ్య పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం గాంధీ కుటుంబ సభ్యులను నామ పరామర్శించి ఆప్తమిత్రుడి పాడే మోసి తమ మధ్య ఉన్న స్నేహ బంధం ఎలాంటిదో చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు నామ కుటుంబ సభ్యులు పలువురు రాజకీయ నాయకులు గ్రానైట్ యజమానులు బొప్పన గాంధీ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా నివాళులర్పించిన వెంకట రాఘవేంద్ర



**కొడంగల్,అక్షిత ప్రతినిధి :**

కొడంగల్ నియోజకవర్గం లోని దుద్యాల మండలం హస్నాబాద్ గ్రామంలో సర్వ టాటా వాటర్ కంపెనీలో రతన్ టాటాకు నివాళు లర్పించారు అనంతరం ఆయన సేవలను కొనియాడుతూ ఉప్పు నుండి ఉక్కు వరకు విలువలతో కూడిన వ్యాపారం అందరికీ సాధ్యం కాదు భౌతికంగా ఆయన మన ముందు లేకపోవచ్చు కానీ అరుదైన వ్యక్తిత్వంలో కోట్లాదిమందితో బంధుత్వం ఉన్న వ్యక్తి ఆయన ఇక లేరు అనగానే మనసు చిమ్ముకుమంది ఎందుకంటే ఆయన మన దేశపు ప్రగతి యువతలో ఉత్తేజము నింపే శక్తి ఎన్నో కుటుంబాలకు కడుపు నింపే కాంతి, అక్షరాలతో కొలువ లేని ఉన్నతి అంతటి ముహూర్తరమైన వ్యక్తి, మన మధ్య లేకపోయినా ఆయన చేసిన పనులు దేశం ఉన్నంతవరకు ఉంటాయి అనడంలో ఎటువంటి అతియో శక్తి లేదు అని ఎస్ వి ఆర్ కంపెనీ మేనేజర్ ప్రవీణ్ కొని ఆడారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి గోపి, షిఫ్ట్ ఇంచార్జ్, నాగేష్, జగన్, మురళి, పవన్, కృష్ణ, ఆపరేటర్స్, బిల్లు ఇంచార్జెస్, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని, పూలతో నివాళులర్పించారు.

# ప్రకాష్ నగర్ బ్రిడ్జి వద్ద పాత లో లెవల్ క్యాజ్ వే నుంచి రాకపోకలు ప్రారంభించాలి

## -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

## -నిర్దేశిత గడువు లోగా ప్రకాష్ నగర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

దసరా పండుగ నుంచి ప్రకాష్ నగర్ బ్రిడ్జి దగ్గర పాత లో లెవల్ క్యాజ్ వే డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేసి రాకపోకలు ప్రారంభించాలని ఆ దిశగా పనులను అక్టోబర్ 11 సాయంత్రం లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.గురువారం మంత్రి, ఖమ్మం పట్టణంలోని 28వ డివిజన్ ప్రకాష్ నగర్ లో పర్యటించి టియుఎఫ్ ఐడిసి నిధులు ఒక కోటి 90 లక్షలతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం మంత్రి ప్రకాష్ నగర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బతిన్న ప్రకాష్ నగర్ బ్రిడ్జిని యధాస్థితికి తీసుకొని వచ్చేందుకు అప్పగించిన నిర్దేశిత గడువు 100 రోజుల లోగా పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని అన్నారు.ప్రజలకు రాకపోకలకు ఇబ్బందుల పరిష్కారం దృష్ట్యా ప్రకాష్ నగర్ వద్ద ఉన్న పాత లో లెవల్ క్యాజ్ వే డైవర్షన్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలన్నారు. పనులు అక్టోబర్ 11 లోగా పూర్తి చేసి పండుగ రోజు నుండి వాహనాల రాకపోకలు జరిగేలా చూడాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ లు ఆర్ అండ్ బి డిఇ చంద్రశేఖర్ ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గొప్ప మానవతా వాది రతన్ టాటా



**యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధిః**

పారిశ్రామిక దిగ్గజం, గొప్ప మానవతా వాది రతన్ టాటా చిరస్మరణీయుడని సామాజిక ఉద్యమ నాయకులు కొడారి వెంకటేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద రతన్ టాటా సంతాపసభను సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేష్ మాట్లాడుతూ రతన్ టాటా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పరిశ్రమలను నెలకొల్పాడని ఆయన అన్నారు. భారత ప్రభుత్వం రతన్ టాటా కు భారత రత్న ఇచ్చి గౌరవించాలని ఆయన కోరారు. కరోనా కాలం లో ఎందరో అభాగ్యులను ఆదుకున్న గొప్ప మానవతా వాది రతన్ టాటా అని ఆయన అన్నారు. సుమారు 40 కంపెనీలకు యజమానిగా ఉంటూ , లక్షలాది మంది కార్మికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత రతన్ టాటా కే దక్కుతుందని ఆయన అన్నారు. సమావేశంలో సామాజిక ఉద్యమ నాయకులు బట్టు రాంచంద్రయ్య మాట్లాడుతూ బ్రిటిష్ వారి కంపనీలను కొనుగోలు చేసి, వారినే కార్మికులుగా నియమించి మన దేశ ప్రతిష్టను రతన్ టాటా ఉన్నత స్థానంలో ఉంచారని ఆయన అన్నారు. ఈ సంతాప సమావేశంలో సామాజిక ఉద్యమ నాయకులు, జర్నలిస్టులు పాక జహంగీర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్ షరీఫ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

# మాజీ జెడ్పీటిసి కర్నాటి రామలింగం దశదినకర్మలో పాల్గొన్న - బిజెపి రాష్ట్ర నాయకులు బూర నర్సయ్య గౌడ్

నాంపల్లి, అక్షిత న్యూస్:
నాంపల్లి మాజీ జెడ్పీటిసి మాల్ మార్కెట్ చైర్మన్ భద్రాచల దేవస్థానం మాజీ డైరెక్టర్ కర్నాటి రామలింగం దశ దినకర్మ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీ విశ్వకర్మ యోజన రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ హాజరై వారి కుటుంబ సభ్యులను పార్మర్శించి రకాడ సానుభూతి తెలియజేయడం అనంతరం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా మెయిన్ సెంటర్ నందు అవుట్ లుక్స్ మేన్స్ వేర్ బట్టలు షాప్ కి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ మండల ముఖ్య నాయకులతో సమావేశమై ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏరెడ్ల శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్, కర్నాటి శ్రీహరి,మండల నాయకులు పానుగంటి మహేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రాములు, పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**గరిడేపల్లి అక్షిత న్యూస్.**

బతుకమ్మ పండుగ సంబరాలలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. గురువారం రోజు నిర్వహించిన సద్దుల బతుకమ్మ గరిడేపల్లి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఇంటిల్లిపాది చెట్టు పుట్ట చేను చేమా అనుకుంటూ అడవిలోకి వెళ్లి తీరొక్క పూలు తీసుకొని వచ్చి బతుకమ్మగా పేర్చి గ్రామంలోని మహిళలంతా ఒకచోటకు చేర్చి బతుకమ్మ పాటలతో కోలాటాలు, భజనలు చేస్తూ ఇంటిలో ఒక ఆడపడుచుని అత్తవారింటికి సాగనంపిన విధంగా బతుకమ్మను ఊరి చివరలో ఉన్న చెరువులో నిమజ్జనం చేయడం జరుగుతుంది. ఇలాంటి సంప్రదాయ పండుగ సందర్భంగా గరిడేపల్లి మండల కేంద్రంలో ప్రతి ఇంటిలో పేర్చిన బతుకమ్మలన్నింటినీ తీసుకొని వచ్చి ఒకచోట చేర్చి బతుకమ్మ పాటలను పాడుకుంటూ చిన్నా పెద్ద తేడా లేకుండా ఊరిలో ఉన్న మహిళలు చిన్నపిల్లలు అనే తారతమ్యం లేకుండా




సాయంకాలం సమయంలో అందరూ నృత్యాలు చేస్తూ, కోలాటాలు వేస్తూ, బతుకమ్మ పాటలు పాడుకుంటూ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు పేర్చుకొని వచ్చిన బతుకమ్మలను కొత్త బస్టాండ్ వద్ద ఉన్న సరస్వతీ నది (తాళ్ల చెరువు) లో నిమజ్జనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని మహిళలు యువతులు చిన్న బాలికలు సుమారు 1,000 మంది పాల్గొన్నారు.

# బతుకమ్మకు ఎంతో విశిష్టత...!

**పిఏసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్...!!**





**జనగామ, అక్షిత ప్రతినిధి:**

తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందని బచ్చన్నపేట పిఏసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ దంపతులు... అన్నారు. గురువారం బతుకమ్మ పండుగ సందర్భంగా సతీ సమేతంగ పండుగలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతు... మండలంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకోవడం సంతోషమని అన్నారు. ముఖ్యంగా మండలంలోని వివిధ శాఖల మహిళ అధికారులు, ఉద్యోగినిలు వారి వారి కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినందుకు వారిని అభినందించారు. బతుకమ్మ ప్రత్యేకంగా పూల పండుగని, దీనికి ఎంతో విశిష్టత ఉందని అన్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నాటితో అమ్మవారు చివరి అలంకరణకు రావడం జరుగుతుందని, మహిళలందరూ పెద్ద ఎత్తున బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# విద్యతో మంచి భవిష్యత్తు సాధ్యం





**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**-అనాథలనే భావన మనస్సు నుండి తీసివేయాలి**

**-జిల్లా యంత్రాంగం మీతో ఉన్నారనే ధైర్యంతో ముందుకు సాగాలి**

**-బాలసదనం పిల్లలతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

మనం బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న ఆనతరం బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బాలసదనంలో ఉన్న 27 మంది పిల్లలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి శ్రీజ ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ లతో కలిసి ఖమ్మం నగరంలో కావేరి రెస్టారెంట్ లో డిన్నర్ కు తీసుకొని వెళ్ళారు. ఈ సందర్భంగా పిల్లలతో కలెక్టర్ సరదాగా గడిపారు. అనాధ అనే భావన తొలగించుకోవాలని ఇతర పిల్లలతో సమానంగా అన్ని రంగాలలో రాణించేందుకు అన్ని అవకాశాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం విద్యపై శ్రద్ధ పెట్టాలని మనం ఇప్పుడు బాగా చదువుకుంటే మంచి స్థాయికి చేరుకొని ఆనందమైన జీవితం గడపవచ్చని నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించవచ్చు అని కలెక్టర్ తెలిపారు. బాల సదనంలోని పిల్లలంతా గొప్ప స్థాయికి చేరుకునేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం అందజేస్తుందని తెలిపారు. చారిత్రాత్మక ప్రదేశాలు చరిత్రకలిగిన విజ్ఞాన పరిశోధకమైన ప్రాంతాలు ఆహ్లాదకరమైన విహారయాత్రల సౌకర్యాలకు కల్పిస్తామని మీకు ఎల్లవేళలా తోడుగా నిలుస్తామని పిల్లలకు కలెక్టర్ భరోసా కల్పించారు. అనంతరం రెస్టారెంట్ లో పిల్లలతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సదుపాయాలు సకాలంలో అందించాలి...

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్....**

**జనగామ, అక్షిత ప్రతినిధి:**

జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ఓ.పి.రిజిస్టర్ ను పరిశీలిస్తూ ఓ.పి. పెంచాలన్నారు. వార్డు ను సందర్శించి అక్కడ వైద్యం పొందుతున్న 9మంది పేషంట్లతో మాట్లాడారు. వైద్యం అందుతున్నదా, భోజనం, టిఫిన్ సమయానికి అందిస్తున్నారా, అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతరం ఇదే విధంగా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ డి.ఎస్.వెంకన్న , డాక్టర్ లు, వైద్య సిబ్బంది ఉన్నారు.



# ఘనంగా సద్దుల బతుకమ్మ

## బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన జన్నపు రెడ్డి శ్రీరామ్ రెడ్డి

**రాయపర్తి అక్షిత ప్రతినిధి**

మండలంలోని పలు గ్రామాలలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో గ్రామాలలో మహిళలు సందడి చేశారు. మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు జన్నపురెడ్డి శ్రీరాం రెడ్డి ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాన్ని సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో గురువారం రోజు ఆయన ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ ఆటలు, పాటలతో డీజే పాటలతో మహిళలు పిల్లలు సంతోషంగా ఆడాతూ నృత్యాలు చేశారు. బతుకమ్మల వేడుకలకు వర్షం కొంత అంతరాయం కలిగించినప్పటికీ ఆనంద ఉత్సవాల నడుమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచ్ లు కుక్కల భాస్కర్, బెల్లి యాదమ్మ పెద్దాపురం, చెట్టే ఎల్లేష్, మండల రాజు, ఉల్లేంగుల సుధాకర్, అల్లాడి కర్ణాకర్, కలిమికోండ బొంద్యాలు, కుక్కల నాగయ్య, నందనబోయిన సాంబశివ, ప్రవీణ్, ప్రభాకర్, సోమరాజు, వంశీ, శ్రీకాంత్, సాంబరాజు, రాజు, గణేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరం...!







## జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా....!!

**జనగామ, అక్షిత ప్రతినిధి:**

బుధవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనం ఆవరణలో టి.ఎం.జి.ఓ. ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం బతుకమ్మ పండుగ కార్యక్ర మాన్ని నిర్వహించారు... ఈ కార్యక్రమానికి..అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)రోహిత్ సింగ్ లతో కలిసి... ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ హాజరయ్యారు.అందంగా అలంకరించిన బతుకమ్మ లను తిలకించి మహిళా అధికారులను, ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయంలో... రంగు రంగు పూల బతుకమ్మలతో పండుగ వాతావరణం కలెక్టర్ సతీసమేతంగా బతుకమ్మ పాటలకు లయబద్ధంగా అటలాడగా.. మహిళల కేరింతలతో సభాప్రాంగణం మారుమ్రోగింది. కలెక్టర్ దంపతులు మహిళలతో బతుకమ్మ ఆట ఆడి బతుకమ్మ ఉత్సవానికి మరింత ఊపును తీసుకువచ్చా రు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ సందర్భంగా....ప్రతి మహిళ కలకాలం సంతోషంగా బ్రతకాలని కోరుకుంటున్నానని తెలిపారు. మహిళ ఉద్యోగులు అధిక సంఖ్య లో పాల్గొని....బతుకమ్మ సంబరాలను ఆనందంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు మహిళలంతా ఉత్సాహంగా పాల్గొని కలెక్టరేట్ కు కొత్త శోభను తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ ప్రథమ బహుమతిని డి ఆర్ డి ఎ వసంత బృంద సభ్యులు అందుకున్నారు.ద్వితీయ బహుమతిని జనగామ యూ.పి.హెచ్.సి. డాక్టర్ శ్రీ తేజ బృందం అందుకోగా... తృతీయ బహుమతిని డిపిఓ స్వరూప బృందం అందుకున్నారు.కన్సోలేషన్ బహుమతులను ఎం.సి.హెచ్. హాస్పిటల్ బృందం, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్ బృందం, బచ్చన్నపేట పి.హెచ్.సి. బృందం, డి.డబ్ల్యు.ఓ. జయంతి (ఐ.సి.డి.ఎస్.) బృందం, పాలకుర్తి పి.హెచ్.సి. బృందం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ కొమరయ్య, ఎస్.హెచ్.జి. మహిళలు , ఇతర శాఖల జిల్లా అధికారులు రాదాకిషన్, రవీందర్, ఏ.ఓ.మల్సూరి , వివిధ శాఖల మహిళా అధికారులు, టి.ఎన్. జి.ఓ. అధ్యక్షుడు ఖాజా షరీఫ్, సెక్రటరీ శ్రీనివాస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సోదరులకు కాటమయ్య రక్షక కిట్లు (సేఫ్టీ మోకులు) పంపిణీ

**- పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

**- మండల గౌడులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలి**

**- పిలుపునిచ్చిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి**

యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి



నకిరేకల్ నియోజకవర్గ కేంద్రం హైస్కూల్లో శు క్రవారం నాడు జరిగే గౌడ కులసోదరుల ఆరాధ్యదైవమైన కాటమయ్య రక్షక కిట్ల(సేఫ్టీ మోకులు) పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొంటున్నారని, రామన్నపేట మండలం నుండి గౌడ కుల సోదర నాయకులు, ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

## ఎత్తిపోతల పథకం చైర్మన్ వెంకటయ్య మృతి

### నివాళ్ళర్పించిన గోవర్ధనశశిధర్ రెడ్డి

**వేములపల్లి అక్షితన్యూస్ :**

వేములపల్లిమండలంరావులపెంట గ్రామంలోని ఎల్. 20 ఎత్తిపోతల పథకం చైర్మన్ పసుల వెంకటయ్యగత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న వేములపల్లి వైస్ ఎంపిపి పాదూరు గోవర్ధన సిపిఐఎం మండలకార్యదర్శి పాదూరు శశిధర్ రెడ్డి లు గురువారం వెంకటయ్య పార్థివదేహానికిపూ లమాలవేసినివాళ్ళర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సా నుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ 18-19 సల్కు నూరు ఎత్తిపోతల పథకం చైర్మన్. పాదూరు గోవర్ధన,సిపిఎం పార్టీ నాయకులు కందుల నాగిరెడ్డి, వడ్డగాని సైదులు,లిఫ్ట్ చైర్మన్ జిన్నె శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుతో మహిళ మృతి

**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:-**

దామచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హనిమీ వయసు 45 పిడుగు పడడంతో మృతి చెందారని అడవిదేవులపల్లి ఎస్సై శేఖర్ అన్నారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హానిమి మిగతా ఏడుగురు తో కలిసి అడవిదేవులపల్లి శివారులో గల మిరప తోటలో కలుపు తీయుటకు వెళ్లారు మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో వర్షం పడడంతో వేప చెట్టు కిందికి మిగతా కూలీలతో కలిసి వెళ్లారు చెట్టు కింద కూర్చున్న సమయంలో భారీ శబ్దంతో చెట్టు పై పిడుగు పడడంతో పతులోతు హానిమి అక్కడికక్కడే మృతి చెందారు మిగతా ముగ్గురు తేజావత్ సక్రియ తేజవత్ కళావతి పాతలోతు గూగ వీరు ముగ్గురు స్పృహ కోల్పోవడంతో మిగతా పక్కన ఉన్నవారు భయంతో కేకలు వేయడంతో పక్క పోలం వారువెంటనే వారి సంబంధికులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులతో కలిసి వెళ్లి స్పృహ కోల్పోయిన వారిని మృతురాలను మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ కు తరలించడం జరిగిందని అన్నారు మృతురాలు పెద్ద కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ తరలించడం జరిగింది.



## ఆటపాటలతో ఆడిపాడిన మహిళలు, యువతులు

### వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బతుకమ్మ వేడుకలు

**వర్ధన్నపేట, అక్షిత ప్రతినిధి :**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవరం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ముఖ్య కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి పాటలతో ఆడిపాడారు. కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, సిబ్బంది ఆధ్వర్యంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బతుకమ్మ సంబరాలు మహిళలు ఎంతో సంతోషంగా మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుపుచ్చుకున్నారు.

రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో బతుకమ్మ తీసుకెళ్తున్న కోయగూర మన్విత శ్రీ



# జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో డీసీసీ అధ్యక్షుడు కేతవత్ శంకర్ నాయక్

అడవిదేవలపల్లి,అక్షిత ప్రతినిధి:-



అడవిదేవులపల్లి వచ్చిన డీసిసి ప్రెసిడెంట్ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాజకీయ ప్రస్థానతండ్రి వీర్య నాయక్ క్యాస్ట్ లంబడ వృత్తి అగ్రికల్చర్ గ్రామం కేతవత్ తండా దిలావర్ పూర్ పోస్ట్ దామరచర్ల మండలం పొలిటికల్ బ్యాగ్ గ్రౌండ్ వర్కిడ్ అస్ మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ 1998 %శీ% 2001కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ గా 2001 లో జనరల్ సీట్ దామరచర్ల నుండి గెలుపొందారు కాంగ్రెస్ పార్టీ యంపీపీ గా జనరల్ సీట్ లో 2006 లో గెలుపొందారు కాంగ్రెస్ పార్టీ నుండి 2006 నుండి 2011 వరకు బ్లాక్ కాంగ్రెస్ దామరచర్ల ప్రెసిడెంట్ గా పనిచేశారు మళ్ళీ తిరిగి 2014 లో కాంగ్రెస్ పార్టీ జడ్పీటిసి గా గెలుపొందారు 2016 లో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గం అధ్యక్షుడు గా 2019 వరకు పనిచేశారు తిరిగి 2019 వ సంవత్సరం లో కాంగ్రెస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఎన్నికైన కేతవత్ శంకర్ నాయక్ తరువాత నల్గొండ జిల్లా ప్లానింగ్ కమిటీ మెంబర్ గా కూడా చేశారు ప్రస్తుత మళ్ళీ కాంగ్రెస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు గా రెండవ సారి పనిచేస్తున్నారు కేతవత్ శంకర్ నాయక్ తండ్రి వీర్య నాయక్ కాంగ్రెస్ పార్టీ దిలవర్ పూర్ సర్పంచ్ గా కూడా పనిచేశారు అడవిదేవులపల్లి దామరచర్ల మండల కేంద్రాల్లో కేతవత్ శంకర్ నాయక్ అంటేప్రతి ఒక్కరికీ బగతెలుసు ఆపదలో ఉన్నామంటే సహాయం చేసే గునమున్న వ్యక్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలలో చాలా యక్టివ్ గా వుండేవారు మాజీ సిల్ పి నేత కుందూరు జానారెడ్డి కి ఆత్మీయ మిత్రుడు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు చాలా సన్నిహితుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యర్యం నుండీ రేవంత్ రెడ్డి అధ్యర్యం లో కాంగ్రెస్ పార్టీ ఎ పిలుపుంచిన భారీగా జన్నని కాంగ్రెస్ కార్యకర్తలను తీసుకెళ్ళే వారు.మునుగోడు ఎన్నికలు దగ్గర ఉండి వర్కింగ్ చేశారు.ఈ సారి అయినా తనకు మిర్యాలగూడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిషత్ చైర్మన్ టికెట్ తనకు కేటాయించాలని తనకు జిల్లా పరిషత్ చైర్మన్ టికెట్ వస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

# పి.ఎ.సి చైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన గాంధీ శుభాకాంక్షలు తెలిపిన బాలింగ్ గౌతమ్ గౌడ్..



శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..

శేరిలింగంపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే అరికే పూడిగాంధీ గురు వారం రోజున పి.ఎ.సి చైర్మన్ గా అసెంబ్లీ లో వారికి కేటాయించిన ఛాంబర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించి తన ఛాంబర్ లో పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగింది గత దశాబ్దం కాలంగా తన శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నిలబెట్టిన నాయకుడు, పేదల కష్టాలు తెలిసిన నాయకుడిగా ఎదిగి వారి కష్టాల్లో భాగం అయ్యి వారికి అండగా నిలిచిన ప్రియతమ నాయకుడు,పనిమంతుడుగా వాసికెక్కిన హ్యాట్రిక్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అలాంటి నాయకుడి పనితీరు ను దృష్టి లో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సముచిత స్థానం లెక్కల సమితికి అధ్యక్షులుగా నియమించడం ద్వారా మరింత బాధ్యతగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారని ఆశిస్తూ గాంధీకి శాలువా కప్పి సత్కరించి, పుష్ప గుచ్చాన్ని అందించి వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్.

# ఘనంగా మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు

యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి



రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కొండ బుచ్చిబాబు గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగుల వెంకటరాజీరెడ్డి, మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి అక్రమ్,వర్కాల మొగులయ్య, కొండ మల్లేశం, గోదాసు పృథ్వీరాజ్ ,నోముల ప్రవీణ్, కొండ పెద్ద శ్రీనివాస్ గౌడ్, పోతగాని రామరాజు, వలమల మల్లేశం, నారపాక అశోక్, కొణతం నాగభూషణం, పబ్బతి ఆంజనేయులు, కడారి నరేష్, వీరమల్ల భిక్షం, సల్ల నరసింహ, బొడ్డుపల్లి లింగస్వామి, కడారి బిక్షమయ్య,భాష మల్ల వెంకటేశం, జినుకుల రాజేందర్, మురళి గౌడ్,నారపాక బిక్షపతి,కొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన సిలువేరు



కోదాడ అక్షిత ప్రతినిధి

కోదాడ సబ్ కోర్టు కు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామకమైన సీనియర్ న్యాయవాది సిలువేరు వెంకటేశ్వర్లు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టు లో జడ్జి లు శ్యాంసుందర్, భవ్య, సత్యనారాయణ లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పలువురు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రతన్ టాటాకు శ్రద్ధాంజలి

## వ్యాపార దిగ్గజంకు ఘనంగా నివాళులు

మియాపూర్ అక్షిత ప్రతినిధి..

ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతి పట్ల మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్తా గ్రామస్తులు గుండె గణేష్, పి. నర్సింగరావు, ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మక్త పోచమ్మ దేవాలయం వద్ద అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతీ ఒక్కరు ఆయనను ఆదర్శనంగా తీసుకొని వ్యాపార రంగం లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. రతన్ టాటా జీవితం ఎందరికో ఆదర్శమని, ప్రపంచంలోనీ ధనవంతుల్లో అయన ఒకరుగా నిలవడం మన దేశానికి గర్వకారణమన్నారు. దాతృత్వంలో కూడా ఆయనికి ఆయనే సాటి అని నిరూపించుకున్న నిరాడంబర జీవితం గడిపిన మహోన్నత వ్యక్తిత్వం వారిదని అన్నారు. అయన మరణం వ్యాపార సామ్రాజ్య లకు తీరని లోటని తమ ఆవేదన వ్యక్త%శీ% చేశారు. ఈ కార్యక్రమంలో పి నర్సింగ్ రావు, కే శ్రీధర్, జి దయానంద్ ముదిరాజ్, జి రాజు, డి శేఖర్, రాము,, చిన్న శ్రీను, దినేష్, వీరేందర్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు పెన్నులు పుస్తకాల పంపిణీ.. అభినవ యూత్ అసోసియేషన్

**భూదాన్ పోచంపల్లి, అక్షిత ప్రతినిధి:**

భూదన్ పోచంపల్లి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా, సరస్వతీ మాత అవతరించినటువంటి మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని, విద్యా సరస్వతి అనుగ్రహ కటాక్షం అనే కార్యక్రమం శ్రీ మద్దెలమ్మ దేవాలయంలో సంయుక్తంగా మరియు పద్మనగర్ దుర్గామండపం లోనూ చిన్నారిలకి అక్షరాభ్యాస%శీ% మరియు పిల్లలకి పుస్తకాలు, పెన్నులు కార్యక్రమాన్ని అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ మద్దెలమ్మ దేవస్థానం అధ్యక్షులు సూరపల్లి రాము , అభినవ యూత్ అధ్యక్షులు జోగు రవీందర్ , పుస్తకాల సంయుక్త ధాత రచ్చ రమేష్ , దేవాలయం ప్రధాన కార్యదర్శి కడవేరు రమేష్ , పద్మనగర్ దుర్గ కమిటీ అధ్యక్షులు బొమ్మహరి, కర్నాటి విగ్నేష్, రచ్చ కరుణాకర్,ముషం నవీన్ యూత్ ప్రధాన కార్యదర్శి వేముల నరేష్, సహాయ కార్యదర్శి మహేశ్వరం ప్రసాద్ ,సాంస్కృతిక కార్యదర్శి బిజ్జా బాలకృష్ణ, వర్కాల గణేష్, దేవాలయ ధర్మకర్తలు, పద్మనగర్ దుర్గ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కోలాట బృందానికి చీరల పంపిణీ

## జి ఎన్ సి విక్టరీ చైర్మన్ గుండు వెంకట్ గౌడ్

**నడిగూడెం, అక్షిత న్యూస్ :**



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో మహిళలు కోలాటం నేర్చుకున్నారని తెలిసి ఆ గ్రామంలోని గుండు నారాయణ సుక్కమల జ్ఞాపకార్థం వారి కుమారుడు జి ఎన్ సి(గుండు నారాయణ, చుక్కమ్మ)విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ గుండు వెంకట్ గౌడ్ కోలాట బృందానికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుండు సరిత గీతిక, ప్రిసిల్ల,గుండు సీతారాములు పోలంపల్లి వెంకటేశ్వర్లు పోలంపల్లి నరసింహారావు జడ గోపి, సైదమ్మ, లక్మి , సులోచన,పసుపులేటి రమాదేవి,భాగ్య లక్ష్మి, కృష్ణవేణి సరిత, నాగలక్మి తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లిలో రాయల నాగేశ్వరావు పరామర్శలు

ఖమ్మం /అక్షిత బ్యూరో :

పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలంలో పలు కుటుంబాలను డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. మొదట కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్య ని అనంతరం కోరట్లగూడెం గ్రామంలో మరణించిన పసుపులేటి వెంకమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. అరెగూడెం గ్రామంలో ఇటీవల మరణించిన వడ్డే లక్ష్మయ్య దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చులికూర నాగరాజు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ జిల్లా ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు బోయిన వేణు వడ్డే జగన్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించాలి

## సబ్ కలెక్టర్ ని కలిసి సమస్యలు వివరించిన జిల్లా ఎఐఎఫ్బి ప్రధాన కార్యదర్శి పరంగి



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి. పరంగి రాము ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్ పరిధిలో అన్ని రకాల సమస్యల పరిష్కారానికి అని విధాలుగా ప్రజలను కలుపుకొని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కొరకు కృషి చేస్తానని అదేవిధంగా అన్ని వర్గాల ప్రజలు కూడా అదే విధంగా సహకారం అందించాలని వారు కోరారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ పోస్టింగ్ ద్వారా బాధ్యతలు స్వీకరించిన నారాయణ అమిత్ మాలేపాటిని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్గొండ జిల్లా బృందం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టియుసిసి జిల్లా కన్వీనర్ ఎండి జలీల్, ఏఐవైఎల్ జిల్లా నాయకులు గుడుగుంట్ల ఉదయ్ కుమార్, అశోక్ కుమార్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి శాంతి కుమారి, మంజుల, శైలజ, మాతంగి బాలు, కరుణాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగ

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

తెలంగాణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిది రోజుల పాటు ఒక్కో పేరుతో బతుకమ్మను పేర్చి ఆడిపాడిన ఆడపడుచులు, పిల్లలు ఈరోజు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్నారు. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన పండుగ ఈరోజు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీక మన బతుకమ్మ పండుగని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. పూలను, ప్రకృతిని దేవుళ్లుగా కొలుస్తూ ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకునే అద్భుమైన పండుగన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అరుదైన, అందమైన సంస్కృతి వారసత్వం మన బతుకమ్మ పండగ అని గుర్తుచేసుకున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆడ బిడ్డలంతా ఎంతో సంతోషంగా ఈ ఘనమైన పండుగను జరుపుకుంటారన్నారు. ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ తల్లి మరిన్ని సంతోషాలు, వెలుగు నింపాలని కోరుకుంటున్నాని తెలుపుతూ ఆడబిడ్డలందరికీ లింగంగౌడ్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# పూల పండుగ



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణం, మండలం వాడ వాడలా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు వర్షం కారణంగా గురువారం రాత్రి ఘనంగా నిర్వహించలేక పోయారు. మధ్యాహ్నం నుండి భారీ వర్షం కురిసి తెరపి ఇచ్చి సాయంత్రం నుండి ముసురు వర్షం పడుతున్నది. అయినా ఒక మోస్తరు నుంచి భారీ సద్దుల బతుకమ్మలను రంగు రంగుల పూలతో అలంకరించి పూజలు చేసి ఆడుతున్న ప్రదేశానికి తీసుకు వచ్చారు. పట్టణంలోని ఈదులగూడ, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం అవరణ, సంతోష్ నగర్, షాంతినగర్, షాబునాగర్, గాయత్రి నగర్, ఎన్ఎస్పీ క్యాంపు ఉత్సవ షెడ్ల కింద, ఫంక్షన్ హాలుల్,లో అపార్ట్మెంట్ల ఆవరణలో ఇంకా అనేక చోట్ల వర్షం కురియని ప్రాంతాలను ఎంపిక చేసి మహిళలు పిల్లలతో కలిసి డిజె బతుకమ్మ పాటలపై కొంతమంది ఆడగా, మరి కొన్ని చోట్ల మహిళలు పాడుతూ చప్పట్లు కొడుతూ ఆడారు. ఆయా ప్రాంతాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు నాగలక్ష్మి భార్గవ్, ఆర్యవైశ్య సంఘం మహిళా నాయకులు రాయపుడి భవానీ, శాలిగౌరారం ఎంపిడిఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, సిఐటియు అంగన్వాడి టీచర్స్ యూనియన్ అద్యక్షులు బొందు పార్వతి, బిసి మహిళా నాయకులు పందిర్ల పద్మావతి, శైలజ, జ్యోతి, శ్యామల, ఇందిరా, సరితలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి కె. రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఒన్ టూ టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు కోట కరుణాకర్, పి. నాగార్జున, కే. వీరబాబు, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

